అక్టోబర్ - 2025

# హన్నాకృప

ఆధ్యాత్మిక మాస పత్రిక

## విషయసూచిక


| | | |
|---|---|---|
| సంపాదకీయం | కె.ఇ. రాజేంద్ర | 02 |
| జప్పత్పనేహు | కొడవటికంటి | 03 |
| నా చిత్తానుసారుడు | కొడవటికంటి | 05 |
| వేర్ ఈజ్ యువర్ హార్ట్ | కె.ఇ. రాజేంద్ర | 07 |
| 'నేను' జ్ఞానిని అనుకో... | హన్నాకృప డెస్క్ | 08 |
| నీ సృష్టికర్త | హన్నాకృప డెస్క్ | 09 |
| ఫలింపు | సాక్ష్యము | 10 |
| బైబిల్ ప్రాముఖ్యత | హన్నాకృప డెస్క్ | 13 |
| మదర్ తెరీసా | వై. ప్రసాద్‌రావు | 15 |
| తల్లిదండ్రులారా! | కె.ఇ. రాజేంద్ర | 17 |
| నేత్రాశ | డా॥ సుష్మ, నెల్లూరు | 19 |
| నా కుటుంబము | స్త్రీల కొరకు | 20 |
| పై రూపము | చిన్నపిల్లల పేజి | 22 |
| బైబిల్ పదవినోదం-10 | | 24 |



**సంపాదకులు :**

**కె. ఇమ్మానియేల్ రాజేంద్ర**

B.A.,B.L.,


**చందా వివరాలు :**

**సంవత్సర చందా రూ. 350/-**

పోషక చందా రూ. 1500/-

జీవితచందా రూ. 5000/-


**చిరునామా :**

ఎడిటర్, హన్నాకృప

పోస్ట్‌బాక్స్ నెం.51 , క్లాపేట, 6వలైను

ఒంగోలు-523001, ప్రకాశంజిల్లా

సెల్ : 9440217726



**బ్యాంకు అకౌంటు వివరాలు :**

A/c Name: **K. Emmanial Rajendra**

A/c No.: **10957294340**

Bank: SBI Main Branch, Ongole

IFSC Code : SBIN0000890




సీరియల్ నంబరు

సంపాదకీయం....

# దేవుడు నీకు కంచె వేస్తాడు

హన్నాకృప పాఠకులకు ప్రభువు నామమున వందనములు.

సూర్యుని నుండి విడుదలయ్యే అతినీలలోహిత కిరణాలు భూమి మీదకు వచ్చి మనుష్యులకు హాని చేయకుండా భూమి చుట్టూ ఆకాశంలో ఓజోన్ అనే ఒక పొరను ఏర్పాటు చేశాడు దేవుడు. అది భూమికి రక్షణ వలయం. భూమి మీద నివసించే మానవులలో మంచివారు, చెడ్డవారు ఉన్నారు. భూమి మీద ఉండే మంచివారి మీదను, చెడ్డవారి మీదను దేవుడు వర్షము కురిపిస్తున్నాడు. అంటే దేవుడు సృష్టించిన మానవులలో ఎవరూ నశించిపోవడం దేవునికి ఇష్టం లేదు. చెడ్డవారిని కూడా ప్రేమిస్తున్న దేవుడు, మరి మంచివారి విషయంలో ఇంకెంత శ్రద్ధ తీసుకుంటాడో యోబు విషయంలో మనకు తెలుస్తుంది. యోబుకు అతనికి కలిగిన సమస్తమునకు దేవుడు కంచె వేసినట్లు సాతాను సాక్ష్యం చెప్తుంది. *"యోబు ఊరకయే దేవునియందు భయభక్తులు కలవాడాయేనా? నీవు అతనికిని అతని యింటి వారికిని అతనికి కలిగిన సమస్తమునకును చుట్టు కంచె వేసితివి గదా? నీవు అతని చేతి పనిని దీవించు చుండుటచేత అతని ఆస్తి దేశములో బహుగా విస్తరించియున్నది" (యోబు 1:9,10).* సాతాను చెప్పినట్లు దేవుడు ఆశీర్వదిస్తేనో, కంచె వేస్తేనో యోబు దేవునియందు భయభక్తులు కలిగిలేడు. యోబు దేవుడిని ప్రేమించి, ఆయనయందు భయభక్తులు కలిగియున్నందువలన దేవుడు అతనిని ఆశీర్వదించి, ఆయనకు కలిగిన సమస్తమునకు కంచె వేశాడు. సాతాను అబద్ధికుడును, అబద్ధమునకు జనకుడును కాబట్టి, ఉన్నది లేనట్లు లేనిది ఉన్నట్లు చెప్తాడు. దేవుడు ఆయనయందు భయభక్తులుగలవారిపట్ల, ఆయనను ప్రేమించే వారిపట్ల ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకుంటాడు. వారికి ఎలాంటి హాని జరగకుండా ఉండేలా, ఎలాంటి ఆపదలు దరి చేరకుండా తగిన జాగ్రత్త తీసుకుంటాడు. *"నీ ప్రక్కను వేయిమంది పడినను నీ కుడిప్రక్కను పదివేలమంది కూలినను అపాయము నీ యొద్దకు రాదు" (కీర్తనలు 91:7)* ఆయన బిడ్డలను సాతాను బారి నుండి కాపాడటానికి ఓజోన్ పొరలాంటి ఒక రక్షణ కవచమును ఏర్పాటు చేస్తాడు. అందుకే సాతాను యోబును ఏమీ చేయలేకపోయింది. అలాగే మనము కూడా యోబువలె దేవున్ని ప్రేమించి, ఆయనను హృదయపూర్వకంగా హత్తుకొని ఉంటే, మన చుట్టూ కూడా దేవుడు ఒక కంచె ఏర్పాటు చేస్తాడు. అప్పుడు మనకు ఎలాంటి హాని జరగదు. మనం నిత్యం అనేకరకాలైన చావుల గురించి వింటూనే ఉంటాము. ప్రమాదాలు, హత్యలు, ఆత్మహత్యలు, అనారోగ్యంలాంటి వాటి వలన ప్రతిరోజూ చాలామంది చనిపోతుంటారు కదా. ఇలాంటి సందర్భాలలో మనకు బాగా తెలిసినవారు ఉన్నప్పుడు మనం చాలా బాధపడతాము. దేవుడు వారిని ఎందుకు కాపాడలేదు అని ఆలోచిస్తాము. ప్రమాదాలు ఎప్పుడూ మన చుట్టూ ఉంటూనే ఉంటాయి. దేవుని బిడ్డలకు కంచె వేయడం ద్వారా ఆయన కాపుదలలో, భద్రతలో ఉంటారు కాబట్టి వారికి ఎలాంటి హాని జరగదు. కాబట్టి దేవుడు ఏర్పాటు చేసిన రక్షణ కవచములోనికి ప్రవేశించాలంటే మనం దేవునియందు భయభక్తులతో ఉండి, ఆయనను ప్రేమించి, ఆయనకు ఇష్టమైన రీతిలో మనం జీవించాలి. అందుకు నీవు సిద్ధమా? -

**కొడవటికంటి ఇమ్మానియేల్ రాజేంద్ర, ఎడిటర్**

**K. Emmanial Rajendra, SBI Main Branch, Ongole**
**A/c No. 1095729434O**

సీరియల్

# జప్నత్పనేహు

40

**(యోసేపు జీవిత చరిత్ర)**

**– కొడవటికంటి**

"మీరంటే ఇద్దరు కదా!" అంది.

"ఇద్దరంటే?" అన్నాడు నవ్వుతూ.

"మీరు, మీ దేవుడు" అంది.

"కాదు, ఒక్కడినే, ఈసారి నా దేవుడు నీతోనే ఉంటాడు. అదీ నా ధైర్యం. నాకంటే ముందుగా నేను వెళ్ళే ప్రతి స్థలములోకి తన దూతను పంపిస్తాడు. నాతో కూడ తన దూతను పంపుతాడు. అంటూ ప్రక్కకి జరిగి నువ్వు ఒంటరిదానవు కాదు కదా! నువ్వు ప్రసవించేలోపు నేను తిరిగి వచ్చేస్తాను అన్నాడు. మరలా చెవిలో చెప్పినట్లు ముందుకు వంగి అప్పుడప్పుడు అలా దూరమైతే, మరలా కలయిక మధురంగా ఉండదా, అదీకాక నేను ఇక్కడే ఉంటే నీ ధ్యాస అంతా నా మంచీ, చెడు మీదనే! నేను ఇంట్లో అడుగుపెట్టి నప్పుడల్లా నీ ముఖం చూస్తే, నేను సంతోషంగా ఉన్నానా, బాధగా ఉన్నానా? అని నీ చూపులు. నేను వెళ్తే నీ ధ్యాసంతా నీలో ఉన్న వాడి మీదనే ఉంటుంది కదా!" అన్నాడు.

"నీకు మా నాయనమ్మ సంగతి చెప్పాను గుర్తుందా?" అని అడిగాడు.

"ఏ సంగతి చాలా సంగతులు చెప్పారు కదా! వాటిల్లో ఏది?" అంది.

"అదే! ఆమె గర్భిణిగా ఉన్నప్పుడు మాటిమాటికి కడుపులో కదలిక వలన బాధ ఎక్కువైతే ఆ విషయమై యెహోవాను అడుగ వెళ్ళింది. జవాబు తీసుకొని మరీ వచ్చింది. నువ్వు కూడా ఆయన దగ్గరకు వెళ్ళి అడగవచ్చు. ఆయన ఖచ్చితంగా జవాబు ఇస్తాడు."

ఆ రాత్రి జప్నత్పకు నిద్రపట్టలేదు. ఆసెనతు నిద్ర పోతుంది. రెండు వందల సంవత్సరాల క్రితం తన తాత తండ్రి ఈ దేశంలో ప్రవేశించడానికి భయపడ్డాడు. అబద్ధం ఆడాడు. తన భార్యనే చెల్లెలని చెప్పాడు. అయితే అప్పుడు ఈ దేశం చాలా చిన్నది అయి ఉండాలి. ఇంత జనం లేకపోవచ్చును. కాని ఆ పిరమిడ్లు మాత్రం మారలేదు. అబ్రాహాముగారి భార్య శారాకు, అప్పటికే డెభ్భై యేండ్లు ఉన్నా, గుడారంలో నివశించినా, ఇసుక ఎడారులలో వందల కొలది మైలు ప్రయాణం చేస్తున్నప్పటికి ఆమె అందం చెక్కు చెదరలేదు. ఫరో చేసిన పొరపాటుకు ఘనంగానే అపరాధ పరిహారంగా గొర్రెలు, గొడ్లు, మగగాడిదలు, దాసులు, పని కత్తెలు, ఆడగాడిదలు, ఒంటెలు ఇవ్వబడ్డాయి. అయినా ఫరోకు, అతని ఇంటి వారికి మహా వేదనలు కలిగాయి. తన తాత తండ్రి అబ్రాహాముగారు అబద్ధమాడినందుకుగాను అతనికి అవమానము కలిగింది.

దేవుని దయవలన తను ఫరోచే రాజ్యాధినేతగా ఆహ్వా నించబడినాడు. తను తన స్వంత జ్ఞానం ఉపయోగించి, పానదాయకుని సహాయం అర్థించడం ఇప్పటికీ దేవుని ముందు చిన్నతనంగా ఉంది. ప్రపంచంలోని దేశాలన్నింటికి ఆహారం అందించే దేశంలో, ఆహారం అందించే వానిగా దేవుడు తనని ఏర్పాటు చేసాడు. ఇకముందు జీవితం కూడా ఆయన చిత్తానుసారమే కాని, దురభిమాన పాపంలో పడకుండా జాగ్రత్తపడాలి అనుకుంటూ నిద్రపోయాడు.

ఉదయం అందరికంటే, ముందు నిద్రలేచిన ఆసెనతు తనే స్వయంగా జప్నత్ప పనులన్నీ చేసింది. పరిచారకులను ఎవ్వరిని దగ్గరకు రానీయలేదు. తల అంటి వస్త్రాలు ధరింప చేసింది. తన చేత్తోనే కిరీటం ధరింపజేసింది. తన అలంకరణ నామమాత్రం అయినా ఖడ్గం ధరించడానికి జప్నత్ప ఇష్టపడలేదు. ఈ విషయంలో ఆసెనతు ఎంతో సంతోషించింది. దేవుని మీద ఆధారపడేవాడు ఇక దేని

మీదను ఆధారపడకూడదని అతని భావన, అదే తన భావన. ఈ ఆరునెలల వివాహ జీవితంలో దేవుని గురించి జప్పత్తు మాట్లాడినది రెండుసార్లు, అదైనా బహుకొద్ది. కాని తన జీవితంలో దేవుని సన్నిధి యధార్ధం. గాలి శబ్దం వింటూ కూడా చూడలేనట్లే, దేవుని కృప మనం అనుభవించుటకే కాని స్పృశించలేము అని అంటుండేవాడు.

రథం కనుమరుగయిపోయే వరకూ చూస్తూనే ఉంది. అది కనబడకపోయినప్పుడు తన చుట్టూ ఎవరూ లేనట్లుగా, గాలి కూడా మాయమైపోయినట్లుగా, అంతా శూన్యంగా అనిపించింది. పెద్దగా పిలిచి గట్టిగా కౌగిలించుకొని, నన్ను కూడా నీతో తీసుకొనిపో! అని ఏడ్వాలనుకుంది, నిలుచున్న చోట నుండి లోనికి రావాలనిపించలేదు. తల్లి, తండ్రి తన ప్రక్కన ఉన్నా, పనివారు ఉన్నా, ఎవరూ లేనట్లే. అయ్యో! తనెందుకు ఇలా అయిపోతుంది. ఇలా కాకూడదనే ఎంత గానో జాగ్రత్తపడింది. ధైర్యంగల విషయాలు ఎన్నో ఆలో చించుకుంది. తనకి తనే చెప్పుకుంది. కాని ఆయన ఉన్నంతసేపు ఏమి అనిపించలేదు. అతను వెళ్ళిపోతూ తన లోని బలం, ధైర్యం, ఆశలు, కోరికలు, భావాలు అన్నీ తీసుకొని వెళ్ళిపోయాడు. అరె! ఇదేంటి? అందరూ తన చుట్టూ చేరుతున్నారు. అమ్మ ఎందుకు ఏడుస్తుంది. కళ్ళు మూసుకొని పోతున్నాయి. ఏమి వినిపించటం లేదు. ఏమిటో ఏమైందో? ఐదు నిమిషాల తర్వాత తన పరుపు మీద కళ్ళు తెరచింది. ఆసెనతు, నీరసంగా ఉంది. అమ్మ కన్నీళ్ళు తుడుచుకోవడం చూచింది. పనివాళ్ళ ముఖాలు జీవం పుంజుకుంటున్నాయి. తనకు బాగాలేదు. కాబోలు అని అనుకొని కళ్ళు మూసుకొని నిద్రపోయింది.

రథం పడమర వైపుగా ప్రయాణం చేస్తుంది. రహదారికి రెండు వైపులా పొడవైన చెట్లు గీత గీచినట్లుగా, ఫరో సైన్యంలాగ నిలబడి ఉన్నాయి. ఎంతో పొడవుగా ఉండి, ఊగుతూ ఉన్నాయి. రథం లాగుతున్న గుర్రాల డెక్కల చప్పుడుకు లయబద్ధంగా ఊగుతున్నట్లు అనిపిస్తున్నాయి. ఆకాశంలో చెట్టు ఎంత ఊగినా దాని మొదలు నేలలో ఉంది కనుక అది వెంట్రుకవాసి అయినా కదలదు. ఎదురుగా ఎర్రనిరాళ్ళతో మెరుస్తున్న చియోప్ పిరమిడ్ అన్నిటికంటే ఎత్తయినది. రథం ముందుకు వెళ్ళేకొద్ది పిరమిడ్ పెద్దది అవుతుంది. పిరమిడ్ పెద్దది అయ్యే కొలది దాని పైభాగము సూదిలా మేడమీద భాగమువలె ఉన్నట్లు కనబడుతుంది. ఈ పిరమిడ్ దగ్గర తన పితరుడైన అబ్రాహాము నిలబడి ఏమి ఆలోచించాడో? ఆయన దేవునితో మాట్లాడిన విశ్వాసి. ఆయనకైనా దేవుడు ఈ పిరమిడ్ రహస్యం తెలియజేసాడో లేదో? ఎందుకనగా రహస్యాలు మన దేవుడైన యెహోవాకు మాత్రమే చెందును. అవి, ఆయన ఎవరికి బయలుపరచితే వారికి, ఎంత బయలుపరిస్తే అంతే అర్ధమౌతుంది.

**(సశేషం)**


**ఫోన్‌పే ద్వారా లేదా గూగుల్ పే ద్వారా పత్రిక చందా పంపించాలంటే క్రింది క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి**

Scan & Pay Using PhonePe App

Emmanial Rajendra

సీరియల్

# నా చిత్తానుసారుడు

36

(దావీదు జీవిత చరిత్ర)

- కొడవటికంటి

మొదట్లో రాజరికం కొంత రీవిని, కొంత విశ్రాంతిని కలుగజేసినా, తన పిల్లలు మాత్రం పుట్టుకతోనే రాజరికపు రీవిని సంతరించుకున్నారు. భార్యలలో ఏ ఒక్కరు అంతగా తన హృదయాన్ని స్పందించలేదు. అంతా యాంత్రికమైనట్లుగా అనిపిస్తుంది. ఇది ఇలా ఎంతకాలం కొనసాగుతుందో ఇశ్రాయేలు రాజ్యంలో చిన్న ముల్లయినా, ఎప్పుడూ ఎక్కడో ఒక చోట కలుక్కుమంటూనే ఉంది. ఈ ముల్లు తీసివేయబడినప్పుడే తనకి ఏదైన ఒక స్థిరత్వానికి పునాది ఏర్పడుతుంది ఆరోజు ఎప్పుడు వస్తుంది? అనుకొంటుండగానే షాగే వచ్చాడని కబురు వచ్చింది. లోనికి రమ్మన్నాడు.

వస్తూనే వందనం చేసి "ఇశ్రాయేలు, మహనయీము" అన్నాడు.

"మరలా యుద్ధమా?" అన్నాడు దావీదు.

"ఇంటి గొడవలు" అని ఒక అడుగు ముందుకేసి రహస్యం చెబుతున్నట్లుగా "ఇష్బోషెతు, అబ్నేరు" అని ఆగి "నా తండ్రి ఉపపత్నితో నీవేల శయనించితివి అని ఇష్బోషెతు అబ్నేరును అడిగాడు" అని చెప్పాడు.

దావీదు ఆలోచనలో పడ్డాడు. షాగే నిశ్శబ్దంగా నిలుచున్నాడు.

"ఏఫెరుకి ఈ సంగతి తెలుసా?" అన్నాడు దావీదు.

"ఏఫెరు మహనయీములోనే మారువేషంలో ఉన్నాడు. ఆయన మనలను పలకరిస్తేనే కాని మారువేషంలో వున్న ఏఫెరును ఎవ్వరు గుర్తించలేరు" అన్నాడు.

"రిస్పా విషయంలో అబ్నేరు రాజ్యకాంక్ష కారణమా? లేక స్త్రీవాంఛా?" అడిగాడు దావీదు.

"సౌలు చనిపోయిన ఇన్ని సంవత్సరాల తర్వాత ఇద్దరు కుమారులున్న రిస్పాతో సంబంధము ఎవరు ఊహించగలరు. ఇష్బోషెతును అబ్నేరు బహుగా కోపగించుకొని నిన్ను దావీదు చేతికప్పగించక నీ తండ్రి అయిన సౌలు ఇంటివారికిని, అతని సహోదరు లకును అతని స్నేహితులకును ఈవేళ ఉపకారం చేసిన నన్ను యూదా వారితో చేరిన కుక్కతో సమానునిగా..."

"యూదా వారితో చేరిన కుక్కగా...అని అన్నాడా?" అంటూ అడ్డు వచ్చాడు దావీదు.

"ఔను, యూదా వారితో చేరిన కుక్కతో సమానునిగా చేసి ఈ దినమున ఒక స్త్రీనిబట్టి నామీద నేరము మోపుదువా? అన్నప్పుడు ఇష్బోషెతు ఏదో చెప్పబోయాడు కాని అబ్నేరు యెహోవా దావీదుకు ప్రమాణము చేసిన దానిని అతని పక్షమున నేను నెరవేర్చని యెడల దేవుడు నాకు గొప్ప అపాయము కలుగచేయును గాక! సౌలు ఇంటివారి వశం కాకుండా రాజ్యమును తప్పించి దాను మొదలుకొని బెయేర్షెబా వరకు దావీదు సింహాసనమును ఇశ్రాయేలు వారి మీదను, యూదా వారి మీదను నేను స్థిరపరచెదను అన్నాడు" అని ముగించాడు షాగే.

దావీదు కొంచెమాలోచించి "నీవు వెళ్ళి అహీతోపెలును పిలువు" అని అన్నాడు.

అహీతోపెలు వచ్చిన తర్వాత అతనితో పరిస్థితి అంతా వివరించి చెప్పాడు.

"అబ్నేరు యోచించినవన్ని యధార్థంగా ఈరోజు కాకపోయినా రేపయినా నెరవేరవలసినవే కదా! చిన్నతనం నుండి ఇష్బోషెతును, చనిపోయిన అతని అన్నలను పెంచినవాడు కాబట్టి అంతటితో వదలిపెట్టాడు. అబ్నేరు వస్తే అతనిని స్వీకరించటమే మంచిది" అన్నాడు.

"మరి యోవాబు ఇందుకు సమ్మతించదేమో!" అన్నాడు దావీదు.

"నిజమే యోవాబుకు ఇష్టం వుండదు. ఈ యూదా రాజ్యమంతా యోవాబు కాదు గదా!" అన్నాడు.

“ఇంక రెండు రోజులలో యోవాబు వస్తాడు” అన్నాడు దావీదు.

“ఎక్కడికి వెళ్ళాడు” అన్నాడు అహీతోపెలు.

“బందిపోటునకు” అన్నాడు దావీదు.

“పన్నెండు గోత్రములు ఏకమయ్యేటంత వరకు ఈ బందిపోటుతనం నశించదను కుంటాను'' అంటూ అహీతోపెలు దావీదు యొద్ద సెలవు తీసుకొని వెళ్ళిపోయాడు.

అమావాస్య అయిపోయిన తర్వాత ఇద్దరు వ్యక్తులు దావీదు రాజు దర్శనార్థం వేచివున్నారని కబురు వచ్చింది.

సాధారణంగా పదిమందితో సంభాషించాలనుకున్నప్పుడు ఏర్పాటు చేసిన చిన్న సభా వేదిక వద్ద దావీదు కూర్చుని ఉన్నాడు. అబీషై, ఎల్హానాను, ఎలీక యోధులు ముగ్గురు కూర్చుని వున్నారు.

“ఎక్కడ నుండి వచ్చారు?” అన్నాడు దావీదు.

“ఇశ్రాయేలీయులు” అన్నాడు.

“ఎందుకు?” అన్నాడు దావీదు.

“అబ్నేరుగారు పంపించారు” అన్నాడు.

దావీదు అబీషై వైపు చూచాడు. లోనికి పంపించు అన్నాడు. ఇద్దరూ ముప్పై సంవత్సరాలు పైబడినవారే. వచ్చి దావీదునకు నమస్కారం చేసారు.

ప్రక్కకు జరిగి నిలుచుని “సైన్యాధిపతి పంపించారు” అన్నాడు.

దావీదు వారి వైపు నిదానించి చూస్తూ “ఎల్హానాను, ఎలీకా” అన్నాడు అనుమానంగా.

వారిద్దరి ముఖాలు వేయిదీపాలు వెలిగినట్లుగా ప్రకాశించాయి. ఇద్దరూ సాష్టాంగ నమస్కారం చేసి నిలుచున్నారు.

“అయ్యా, ఎప్పుడో పదిహేనేళ్ళ క్రితం తమరి యొద్ద కొద్దినెలలు వున్నాము. తమరు మమ్మల్ని గుర్తించుకోవటము మా అదృష్టము” అన్నారు.

దావీదు ఏమి మాట్లాడలేదు. అబీషై వారి వైపు చూస్తు “చెప్పండి” అన్నాడు అబీషై. వారు దావీదు వైపు చూచారు. చెప్పండి అన్నట్లు చూచాడు దావీదు.

ఎలీక తన నడికట్టులోనుండి పత్రిక తీసి అబీషైకి ఇచ్చాడు.

అబీషై లేచి నిలుచుని పత్రికను చదువుతున్నాడు.

“ఈ దేశము ఎవరిది? నీవు నాతో నిబంధన చేసిన యెడల నేను నీకు సహాయము చేసి ఇశ్రాయేలు వారినందరిని నీతట్టు త్రిప్పెదను, భవదీయుడు, అబ్నేరు”.

దావీదు ఎడమ ప్రక్కగదిలో ఉన్న లేఖికుని పిలిపించి “మంచిది. నేను నీతో నిబంధన చేసెదను అయితే నీవు ఒక పని చేయవలెను. నా దర్శనమునకు వచ్చునప్పుడు సౌలు కుమార్తెయగు మీకాలును నా యొద్దకు తోడుకొని రావలెను. లేదా నీకు దర్శనము దొరకదు. దావీదు యూదా రాజు” సంతకం చేసాడు. మరలా...

“ఇష్బోషెతు, ఇశ్రాయేలు రాజునకు ఫిలిష్తీయుల నూరుమంది ముందోళ్ళను తెచ్చి నేను పెండ్లి చేసుకొనిన మీకాలును నాకప్పగింపుము. దావీదు, యూదారాజు” అని ఇష్బోషెతుకు కూడా లేఖ వ్రాశాడు.

“ఈ పత్రికలను మన వారి ద్వారా మహనయీము పంపించు” అని అబీషైకి చెప్పాడు.

ఇష్బోషెతు పత్రిక అందుకున్న వెంటనే అబ్నేరుకు ఆ పత్రిక ఇచ్చాడు. ఇష్బోషెతుకు అబ్నేరునకు దావీదు రాజునకు మధ్య కుదిరిన సంధి ఏ మాత్రము తెలియదు. అబ్నేరును పిలిచి పత్రిక అతని చేతికిచ్చాడు.

“నేను గల్లీము వెళ్తున్నాను” అని బయలుదేరాడు అబ్నేరు.

గల్లీములోనే కాక ఆ ప్రాంతమంతటికి ధనవంతుడు, పదిమంది సైనికులతో మీకాలును తీసుకెళ్ళడానికి పల్లకితో వస్తున్న అబ్నేరును చూసి ఆ ప్రజలు మామూలుగానే ఎప్పుడు వస్తున్నట్లుగా వస్తున్నాడని అనుకున్నారు. మీకాలైతే అబ్నేరును చూచి తన తమ్ముడు ఇష్బోషెతు దగ్గర నుండి ఏదో శుభవర్తమానం తెచ్చాడనుకొని సంతోషంగా అబ్నేరును ఎదుర్కొనినది అయితే అబ్నేరు ముఖం జేవురించి ఉండటం చూచి ఆగిపోయింది. **(సశేషం)**




# ‘వేర్ ఈజ్ యువర్ హార్ట్’



‘హృదయం ఎక్కడున్నది నీ చుట్టూనే తిరుగుతున్నది’ అన్నది సినిమా పాటే కావచ్చు కానీ, ప్రతి ఒక్కరి హృదయం ఎక్కడో తిరుగుతూనే ఉంటుంది. హృదయం ఎప్పుడూ ఒక్క క్షణం తీరిగ్గా కూర్చోదు. ఏదో తపన, ఏదో ఒకటి చేసెయ్యాలి. కోతికి కొబ్బరికాయ దొరికినట్లు హృదయానికి ‘స్మార్ట్‌ఫోన్’ రూపంలో చేతినిండా పని దొరికింది. ఇంక హృదయానికి పంట పడింది. దాని చుట్టూ తిరిగే పని లేకుండా హృదయాన్ని స్మార్ట్‌ఫోన్‌లో పెట్టేసి సెక్యూరిటీ పాస్‌వర్డ్‌తో లాక్‌చేసి పారేశారు. ఇంక హృదయం స్మార్ట్ ఫోన్‌లో నుండి బయటికి రావాల్సిన అవసరమే లేకుండా స్మార్ట్‌ఫోన్ ప్రపంచంలో కావలిసినంత ఎంటర్‌టైన్‌మెంట్. అప్పుడెప్పుడో యేసుప్రభువు ‘నీ ధనమెక్కడ నుండునో అక్కడనే నీ హృదయము ఉండును’ అని చెప్పాడు. ఇప్పుడైతే ‘నీ స్మార్ట్‌ఫోన్ ఎక్కడ ఉండునో అక్కడే నీ హృదయం ఉంటుంది’ అని చెప్పాల్సి వచ్చేంతగా ప్రతిఒక్కరూ స్మార్ట్ ఫోన్‌కి బానిసలయ్యారు. ‘నరుల హృదయాలోచన వారి బాల్యము నుండి చెడ్డది’ (ఆది. 8:21). ఇలాంటి చెడ్డ హృదయాన్ని ఈ స్మార్ట్‌ఫోన్, ఇంటర్నెట్, సోషల్ మీడియా ఇంకా చెడగొట్టి దేవునికి దూరం చేస్తుంది. యేసుక్రీస్తు రెండవ రాకడ నేడో రేపో అన్నంత దగ్గరగా ఉంది అనటానికి నిదర్శనంగానే దేవుని సువార్త స్పీడుగా వ్యాప్తి చెందటానికి దేవుడు స్మార్ట్‌ఫోన్‌ని సృష్టించాడు. స్మార్ట్‌ఫోన్‌లో బైబిలు ఉంటుంది కదా నా బిడ్డలు రోజూ బైబిలు చదువుతారులే, యూట్యూబ్‌లో రోజూ దేవుని వాక్యము వింటారులే, వాట్సాప్, ఫేస్‌బుక్ ద్వారా నా వాక్యాన్ని 24 గంటలూ షేర్ చేస్తారు అని భావించాడు. దేవుడు సృష్టించిన దానిని చెడగొట్టటమే సాతాను లక్ష్యం కాబట్టి ఆ స్మార్ట్‌ఫోన్ ద్వారానే మనుష్యులను నాశనం చేయడానికి ప్లాన్ చేసి, స్మార్ట్‌ఫోన్ నిండా చెత్తాచెదారం పోసింది. మనుష్యులు దేవున్నే బురిడీ కొట్టించే అతితెలివితో దేవుని వాక్యం ఏవో రెండు పోస్టులు పెట్టి, ఇంక రోజంతా సాతాను పని మీదనే ఉంటారు. పాపం సాతాను మనకోసం ఎంతో కష్టపడి చేసిన యాప్‌లు వాడకపోతే సాతాను బాధపడుతుందని జాలిగల హృదయంతో సాతానును ఎక్కువ బాధపెట్టకుండా యాప్‌లు మొత్తం ఇన్‌స్టాల్ చేసుకొని ఆ చెత్తలో పడి పొర్లాడటమే గొప్ప భాగ్యమన్నట్లు నిద్ర కూడా పోకుండా మరీ వాడుతున్నారు. చదువువున్నా లేకపోయినా, పేద గొప్ప, ఆడ మగ, చిన్న పెద్ద, అన్యజనులు క్రైస్తవులు అన్న తేడా లేకుండా ఈ సోషల్ మీడియా మత్తులో మునిగిపోయారు. చివరికి దేవుని పని చేస్తున్నామని చెప్పుకునే సంఘకాపరులు, సువార్తికులు కూడా సాతాను ట్రాప్‌లో పడ్డవారిని రక్షించాల్సింది పోయి, వారే సాతాను ట్రాప్‌లో చిక్కి యూట్యూబ్‌లో దేవుని వాక్యము పెట్టడం ద్వారా డబ్బు సంపాదనలో బిజీగా ఉన్నారు. గతంలో ‘రండి, వినండి, రక్షణపొందండి’ అనే నినాదంతో వాక్యం ప్రకటించేవారు. ఇప్పుడైతే ‘లైక్, షేర్, సబ్‌స్క్రైబ్ చేయండి’ అని బతిమాలుకుంటున్నారు. ఈ సోషల్ మీడియా అనేది మనుష్యులందరికీ ఒక మాయా విగ్రహమైపోయింది. నిద్ర లేచిన దగ్గర్నుండి మళ్ళీ పడుకొనే వరకు దాని పూజలోనే అందరూ తరిస్తున్నారు. ‘మీ హృదయము మాయలలో చిక్కి త్రోవ విడిచి యితర దేవతలను పూజించి వాటికి నమస్కరింపకుండ మీరు జాగ్రత్తపడుడి’ (ద్వితీయో. 11:16) అని దేవుడు హెచ్చరించిన విషయం ఎవరికీ వినబడలేదు, కనబడలేదు. ఎందుకంటే అందరూ ఈ సోషల్ మీడియా మాయలో చిక్కి త్రోవ విడిచి స్మార్ట్‌ఫోన్‌కి, ఇంటర్నెట్‌కి బానిసలైపోయారు. మరి మీ పరిస్థితి ఏంటి? మీ హృదయం ఎక్కడుంది? “ప్లీజ్ చెక్... వేర్ యువర్ హార్ట్ ఈజ్...”

**ఫోన్‌పే లేదా గూగుల్ పే ద్వారా పత్రిక చందా పంపవలసిన ఫోన్ నంబరు**

**9 4 4 0 2 1 7 7 2 6**

# 'నేను' జ్ఞానిని అనుకొనవద్దు

**''నేను జ్ఞానిని గదా అని నీవనుకొనవద్దు. యెహోవాయందు భయభక్తులు గలిగి చెడుతనము విడిచిపెట్టుము" (సామెతలు 3:7).**

సహజంగానే ప్రతి ఒక్కరూ ఎవరికి వారు జ్ఞానము గలవారని అనుకుంటారు. వారికి అపారమైన తెలివితేటలు ఉన్నాయని భ్రమపడుతుంటారు. జ్ఞానమునకు మూలము దేవుడు. ఏ మనిషికైనా దేవుడు అనుగ్రహిస్తేనే తప్ప జ్ఞానము రాదు. దేవుడు మనుష్యులను పరిపూర్ణ తెలివితేటలతో, జ్ఞానముతో పుట్టించింది, వారిని సృష్టించిన దేవున్ని గుర్తించటానికే తప్ప దేవుడు అనుగ్రహించిన జ్ఞానము, తెలివితేటలతో ఈ లోకములో సుఖము అనుభవించటానికి కాదు. దేవుడు మనుష్యులకు జ్ఞానము అనుగ్రహించినది దేవున్ని పరిశీలనగా తెలుసుకోడానికే. కాని మనుష్యులు అది గ్రహించకుండా తాము పుట్టుకతోనే జ్ఞానవంతులమని, తెలివితేటలు తమకు తాముగా సంపాదించుకున్నవని భావిస్తుంటారు. దేవుడు మనిషికి అనుగ్రహించిన తెలివి తేటలను, జ్ఞానాన్ని తన కోసం, తన ఘనతకోసం, ఈ భూమి మీద తను సుఖపడటం కోసం ఉపయోగిస్తున్నాడే తప్ప దేవున్ని వెదకటానికి కొంచెం కూడా ఉపయోగించటం లేదు. మనిషి తాను చేసే పనిలో విజయం సాధించినప్పుడు అది తన గొప్పతనమేనని భావిస్తాడు. విఫలమైనప్పుడు మాత్రం దేవున్ని నిందిస్తాడు. ఈ లోకంలో పుట్టిన గొప్ప గొప్ప మేధావులు, శాస్త్రవేత్తలు, పరిశోధకులు కలిగియున్న జ్ఞానము దేవుడు అనుగ్రహించిందే. ఈ రోజుల్లో మనిషి ఉపయోగిస్తున్న వస్తువులన్నీ సెల్‌ఫోన్, టి.వి., ఫ్రిడ్జ్, కారు, కంప్యూటర్, ఇంటర్నెట్, టెక్నాలజీ ఏదైనా సరే, అది ఎవరు కనిపెట్టినా సరే, అది దేవుడనుగ్రహించిన జ్ఞానముతోనే సాధ్యము తప్ప మనిషికి స్వతహాగా సాధ్యంకాదు. ప్రత్యక్ష గుడారముకు సంబంధించిన వస్తువులు, పనిముట్లు తయారుచేయడానికి దేవుడు బెసలేలు అనే వ్యక్తిని నియమించి అతని హృదయంలో జ్ఞానము ఉంచినట్లు చూడగలము (నిర్గమ. 31:2-6). అయితే మనిషి తాను దేవుని నుండి పొందిన జ్ఞానమునుబట్టి దేవునికి కృతజ్ఞత కలిగి వుండక దేవుడిచ్చిన జ్ఞానము ద్వారా తాను గొప్ప పేరు ప్రఖ్యాతులు సంపాదించాలని ఉబలాట పడుతుంటాడు. తన జ్ఞానము, తెలివితేటలు తనకు తాను సంపాదించుకున్నవి అనుకోవడం వలన మనిషి గర్విస్తాడు. గర్వము నాశనమునకు మూలము కాబట్టి, తానే సంపాదించు కున్నాను అనుకున్న జ్ఞానము వలన తాను నాశనమైపోతాడు. *"జ్ఞాని తన జ్ఞానమునుబట్టియు, శూరుడు తన శౌర్యమును బట్టియు అతిశయింపకూడదు, ఐశ్వర్యవంతుడు తన ఐశ్వర్య మునుబట్టి అతిశయింపకూడదు. అతిశయించువాడు దేనిని బట్టి అతిశయింపవలెననగా, భూమి మీద కృప చూపుచు నీతిన్యాయములు జరిగించుచున్న యెహోవాను నేనేయని గ్రహించి నన్ను పరిశీలనగా తెలుసుకొనుటనుబట్టియే అతిశ యింపవలెను" (యిర్మీయా 9:23,24).* దేవున్ని పరిశీలనగా తెలుసుకొనినవాడే నిజమైన జ్ఞాని. దేవునికి విరోధమైన జ్ఞానము మనిషిని నాశనం చేస్తుంది అనటానికి సొలొమోనును ఉదాహరణగా తీసుకొనవచ్చును. తాను దేవునికి వ్యతిరేకి అయిన తరువాత అతని జ్ఞానము అతనిని కాపాడలేక పోయింది. కాబట్టి దేవుడు మనకిచ్చిన జ్ఞానమునుబట్టి అతిశయించక జ్ఞానమునకు మూలమైయున్న దేవునియందు అతిశయించుదాము.

### సాక్ష్యాలకు ఆహ్వానము

మీ జీవితాలలో దేవుడు చేసిన మేలులను ఇతరులకు తెలియపరచుట ద్వారా దేవుని నామానికి మహిమ కలగడమే కాక వినినవారు విశ్వాసంలో బలపడుటకు మీ సాక్ష్యం ఉపయోగపడవచ్చు. కావున మీ అమూల్యమైన సాక్ష్యాలు మాతో పంచుకొనిన యెడలవాటిని సంతోషంగా పత్రికా ముఖంగా ప్రచురించుటకు మేము సిద్ధంగా ఉన్నాము. దేవుని నామ ప్రకటనలో మాతో పాటు మీరు పాలి భాగస్తులు కావాలని ఆశిస్తున్నాము.

# నీ సృష్టికర్త

దేవుడు సృష్టించిన వాటిని పరిశీలనగా చూసి, ఆలోచిస్తే ఆయన శక్తి సామార్థ్యాలు, ఆయన గుణగణాలు మనకు అర్థమవుతాయి అని బైబిల్ సెలవిస్తుంది.

*"ఆయన (దేవుని) అదృశ్యలక్షణములు, అనగా ఆయన నిత్యశక్తియు దేవత్వమును జగదుత్పత్తి మొదలుకొని సృష్టింపబడిన వస్తువులను ఆలోచించటం వలన తేటపడు చున్నవి" రోమా 1:20*

సృష్టిలో ఎన్నో వింతలు, అద్భుతాలు ఉన్నాయి. అయితే అన్నింటిలో విశిష్టమైనది ప్రాముఖ్యమైన అద్భుతమైన సృష్టి మనిషి.

మానవ దేహము, దానిపనితీరు, దాని సామర్థ్యములను గురించి నిశితంగా పరిశీలిస్తే ఇంతటి అద్భుతమైన శరీరమును నిర్మించిన, నీ నా సృష్టికర్తయైన దేవుని తలంచకుండా ఉండలేము. అయితే ఆయన సృష్టే ఇన్ని ఆశ్చర్యాలతో అద్భుతాలతో మిళితమై ఉన్నది అంటే ఇక సృష్టికర్త అయిన దేవుని యొక్క శక్తి సామర్థ్యాలను, జ్ఞానాన్ని అంచనా వేయుటకు కూడా మనిషి సరిపోడు అని ఇట్టే అర్థమౌతుంది.

మానవ దేహమును గూర్చి సరియైన, పూర్తిస్థాయి జ్ఞానాన్ని కనుగొనుటకు శాస్త్రవేత్తలు, రకరకాల శాస్త్రాలలో డాక్టరేట్ డిగ్రీతో పట్టబద్రులైన వారు తలమునకలౌతున్నారు. అయితే మానవ దేహం కంటే అధ్భుతమైనది, దేవునిచే కేవలం మనుష్యులకు మాత్రమే అనుగ్రహింపబడిన మరొక ప్రత్యేకమైన ఇంద్రియం "మనసు"

*"నా అంతిరింద్రయములు నీవే కలుగజేసితివి. నా తల్లి గర్భమందు నన్ను నిర్మించినవాడవు నీవే. నీవు నన్ను కలుగజేసిన విధము చూడగా భయమును ఆశ్చర్యమును కలుగుచున్నవి. అందును బట్టి నేను నీకు కృతజ్ఞతాస్తుతులు చెలించుచున్నాను. నీ కార్యములు ఆశ్చర్యకరములు" కీర్తన 139:13,14*

ఈ ప్రపంచంలో ఏ ఒక్కరు ఎదుటి వారి మనసులో ఏముందో గ్రహించలేరు. ఎంతో సన్నిహితులైనప్పటికి, ఎంతో కాలం నుండి కలిసి జీవిస్తున్న భార్య భర్తలైనను, తల్లిదండ్రులు బిడ్డలు ఎవరైనప్పటికి ఏ ఒక్కరు మరొకరి మనస్సును గ్రహించలేరు. అంటే వాస్తవానికి నీ వెవరివో, నీ ఆలోచనలేంటో, నీ మనసులో ఏమి జరుగుతుందో అనేది కేవలం నీకు, దానిని సృష్టించిన ఆ దేవునికి తెలుస్తుంది.

మానసిక శాస్త్రవేత్తలైనవారు సైతం రకరకాల ప్రయోగాల ద్వారా మరొకరి మనసులోని భావాలను తెలుసుకొనుటకు ప్రయత్నించినప్పటికి అది కేవలం వారి అంచనా మాత్రమే.

ఏ కన్ను వీక్షించలేని ఈ మనస్సు మాత్రం మన ఆలోచనలను అందలి ఉద్దేశాలను గమనించి సంబంధిత విచక్షణ సహితమైన తలంపులను మనకు కలుగజేస్తుంది. దానినే మనం మనస్సాక్షి అంటాం.

మన(స్సు)లోని ఆలోచనలకు అవి మంచివైన చెడువైనా వాటిని చూడగలిగేది మనస్సు ఒక్కటే అందుకే ఎప్పుడైనా మనం తప్పు చేస్తున్నప్పుడు మనస్సాక్షి మనలను గద్దిస్తుంది.

నైతికత, విచక్షణ వంటివి కేవలం మనుష్యుల్లోనే చూస్తాం. అటువంటి మహత్తరమైన మానవునితో, మానవునిలో అంతర్లీనమైన మనస్సు అనే అంతరింద్రయమును సృష్టించి మనకి ఉచితముగా ఇచ్చిన దేవుని శక్తి సామర్థ్యాలను గూర్చి ఏమని చెప్పగలము?

దావీదు తన పుట్టకను గూర్చి, తన అంతరింద్రయములను గూర్చి, ఆలోచించి దేవుని ఔన్నత్యాన్ని గ్రహించాడు అందుకే దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లిస్తున్నాడు. మరి సృష్టికర్త పట్ల నీ వైఖరి ఏమిటి? శక్తివంతుడైన నీ సృష్టికర్తకు భయపడుతున్నావా? ప్రేమించి ఆయన నీకిచ్చిన అద్భుతమైనదేహమును బట్టి ఆయనకు కృతజ్ఞత కలిగి జీవిస్తున్నావా?

**సాక్ష్యము**

# ఫలింపు

నా పేరు ఝాన్సీరాణి, మాది తెనాలి పట్టణము. మాది నిష్ఠతో, మూఢ భక్తితో విగ్రహాలను పూజించే కుటుంబం. ప్రతిరోజు దినాహారాన్ని నైవేద్యాలగా అర్పించే వారము. నా బాల్యం నుండి పాపభీతి దైవప్రీతి, సంఘ నీతి ఆవశ్యకత ఆధారంగా జీవించాను. సున్నితమైన మనఃస్సాక్షి, భావాలతో యితరులను గౌరవించి మాట్లా డడం మా సాంప్రదాయం. అందుకే అన్ని కులాలవారు, మతాల వారు మమ్ములను ప్రేమగా పలుకరిస్తూ ఆ ఊరిలో గవినుల వద్ద కూర్చుని తీర్పు తీర్చు పెద్దగా నా భర్త గౌరవమర్యాదలు, పొలిటికల్‌గా పేరున్న పెద్దగా భర్తతోపాటు నాకు కూడా ప్రాధాన్యత యిచ్చారు. నేను ఝాన్సీరాణినేగానీ, పిరికి మనస్సుతో ఉండేదాన్ని. కాలేజీ అభ్యాసము J.M.J. St.Joseph (క్రైస్తవ కళాశాల) గనుక ప్రార్థన, బైబిలు, వాటిని ఉపయోగించే క్రైస్తవుల గూర్చి అవగాహన ఏర్పడింది. అక్కడ కాథలిక్ సిస్టర్స్ తెల్ల వస్త్రాలలో వైరాగ్య జీవితం నాకు చాలా ఆశ్చర్యాన్ని కల్గించి, వారి వద్ద ప్రార్థనలు చేయువిధం తెలిసికొని, వారిని ప్రార్థించమని అర్థించేదానిని.

వివాహానంతరం, నా భర్త పొలిటికల్ గా పెద్ద స్థానంలో ఉడడం వల్ల అన్ని జాతుల వారితో సత్సంబంధాలు అవసరం గనుక చర్చికి వెళ్ళి ప్రార్థించుకోవడం క్రైస్తవులను ఆప్యా యంగా పరిచయం చేసికోవడం పరిపాటి. నాకు ఇద్దరు కుమార్తెలు వల్లిక, లతలు నాతో లతల్లా పెనవేసుకొని నా అభిప్రాయాలు గౌరవించేవారు. నా పెద్దమ్మాయి వల్లికకు అనుకూలుడైన సాత్వీకుడైన శివగారితో వివాహం జరిగింది. ఆ తర్వాత లతకు అద్భుత రీతిగా విజయలక్ష్మి తాతినేని గారి ప్రథమ పుత్రుడు బుజ్జిగారితో వివాహ నిర్ణయం కేవలం నా జీవితానికి మా బిడ్డల జీవితానికి పరలోక నిత్యవాసులుగా స్థిరపడడానికి దేవుని ప్రత్యేక ప్రణాళికగా నేను దృఢంగా నమ్మి సదా స్తుతిస్తున్నాను.

మా చిన్నమ్మాయి డాక్టర్ చదివే రోజుల్లో నా భర్త మరణం నన్ను కృంగదీసింది. మా వియ్యపురాలు వారి చెల్లెలు, వారి తోటికోడలు , ప్రక్కింటి వారి సాక్ష్యాలు, పరిచర్య ఇవన్నీ కథలుగా పొడిపొడిగా విన్నాను. అంతగా హృదయానికి తాకలేదు. ఎవరూ నన్ను మతపరంగా ఒత్తిడి చేయలేదు మేము నొచ్చుకుంటామని ముక్తసరిగా చెప్పేవారంతే. యేసు క్రీస్తంటే అయిష్టత లేదు అయితే యేసు పటాన్ని మా యిష్ట దేవతల ప్రక్కకు చేర్చాను. అనుకోని రీతిగా ఒకసారి నేను పడిపోయాను. కాలు విరిగింది. నడవలేని సమయంలో ఒక క్రైస్తవ సోదరి రోజూ నన్ను దర్శించి ప్రార్థన చేసేవారు నేను బాధలో ఉన్నానని ఉపశమనం కోసం వివరంగా చెప్పసాగారు. క్రీస్తు యేసును రక్షకునిగా స్వీకరించడం ఆవశ్యకత. ఆ దేవుడే శాంతిదాత, స్వస్థపర్చు యెహోవా దేవుడని ఎందరో మాట మాత్రం చేత అద్భుత స్వస్థత పొందారని రక్షణ, పాప క్షమాపణ, స్వస్థత, నిత్యరాజ్యం వీటి విషయాలు చాలా స్పష్టంగా బోధించారు. నా బాధలో వారి మాటలు చాలా ఉపశమనాన్ని కల్గించి మానసికంగా ఊరట చెందాను.

యీ క్రైస్తవ బృందము వ్యాధి సమయంలో హిజ్కియా చరిత్రను వివరంగా బైబిలులో చూపించారు. నాకెంతో నచ్చింది. హిజ్కియా మొట్టమొదటిగా తాను సంస్కరించు కున్నాడు. 2 రాజులు 18:3. ఆ తర్వాత యూదా సమాజాన్ని సంస్కరించడానికి సాధనంగా నిలిచాడు. సరిగ్గా నేడు నా రక్షణ కార్యం తర్వాత నా ఆశయం అదే. హిజ్కియా పూర్ణముగా నీతిని అనుసరించాడు. నైతిక విషయాల్లో రాజీపడలేదు. కష్టమైనా నష్టమైనా ప్రవాహానికి ఎదురీదాడు. 2 దినవృత్తాంతములు 31:20,21 హిజ్కియా దేవుని దృష్టికి నమ్మకంగా సేవించాడు. తాను ఆరంభించిన ప్రతి పని హృదయపూర్వకముగా జరిగించి వర్థిల్లాడు. నేను కూడా క్రీస్తును నమ్మాలి వర్థిల్లాలనే ఆశతో రక్షణ పొందగల్గాను.

యోహాను 20:29 యేసు, "నీవు నన్ను చూచి నమ్మితివి చూడక నమ్మిన వారు ధన్యులని" తోమాతో చెప్పారు. వినుట వలన విశ్వాసం కలుగును. చెవులు గలవాడు వినునుగాక యీ మాటలన్నీ నా జీవితంలో నా యిద్దరి బిడ్డల విశ్వాస జీవితంలో అక్షరాలా నెరవేరాయి. శిష్యులలాగ సూచక క్రియ అడుగలేదు. అద్భుత స్వస్థత పొందలేదు కేవలం సామాన్య నమ్మిక మమ్ములను క్రీస్తు చెంతకు నడిపించింది.

నాకు బలహీనత కల్గిన రోజుల్లో మరొక హైందవ సోదరి క్రీస్తులో విశ్వాసిగా నిలిచి నన్ను నిలబెట్టింది. శ్రీమతి లక్ష్మి కుమారి నన్ను బైబిలు సత్యాలకు పరిచయం చేసి, వారి సంఘ క్రమానికి నన్ను వెంటబెట్టుకొని తీసికొని వెళ్ళి ప్రార్థన, వాక్య పఠనము ఉపవాస దీక్షకు ప్రేరేపించారు. అరటిపండు ఒలిచి నోట్లో పెట్టేంతటి నైపుణ్యములో క్రీస్తు కోరిన ఆత్మీయ ఫలాలపంట సమృద్ధిలో ఆ పాస్టరుగారు నన్ను ఆత్మీయతలో బలపర్చుచున్నారు. "కాబట్టి మీరాయన రాజ్యమును నీతిని మొదట వెదకుడి అప్పుడవన్నియు మీకను గ్రహింపబడును" మత్తయి 6:33. అట్లే నాకు ఆదర్శమైన హిజ్కియా కూడా దేవుని నీతిని న్యాయవిధులను అనుసరించాడు. 2 రాజులు 18:4, హిజ్కియా ఉన్నత స్థలములను కొట్టివేసి విగ్రహములను పగులగొట్టి, దేవతా స్థంభములను పడగొట్టి మోషే చేసిన ఇత్తడి సర్పమును భిన్నాభిన్నము చేసెను. విగ్రహారాధన పూర్తిగా మాను కున్నాను. ఆయన చిత్రపటాలు పెట్టుకోవడం కాదు. ఆయన భావాలు, ప్రేమ సాత్వీకము మనలో కన్పించాలనీ నాలో నేనెదిగిన ఎత్తైన స్థానం ఆ దేవుని పాదసన్నిధి అని సంపూర్ణం గా గ్రహించాను. 2 రాజులు 18:5, హిజ్కియా దేవుని యందు విశ్వాసముంచెను. నేను కూడా యేసును స్వరక్షకు నిగా అంగీకరించి, విశ్వాసించాను. పాపాలు క్షమించమని అడిగాను. రక్షణ స్థిరత కల్గింది. కొందరు గుఱ్ఱముల రథాలు ద్వార అతిశయస్తారు కాని మనం యెహోవా నామమును బట్టి అతిశయించాలని తెలుసుకున్నాను. మెండుగా నిండుగా దీవెనలు కావలెనంటే యెహోవాను హత్తుకోవాలి. పెద్ద చెట్టుకు లతలాగా అల్లుకుపోవాలి. నా బిడ్డలు నా విశ్వాసంలో లతలాగ లత, వల్లిక అల్లుకు పోయారు. ఎన్ని తుఫానులు వచ్చినా తీగ చెక్కుచెదరదు. రోమా 8:35-39 ఏ సంఘటన అయిననూ క్రీస్తు ప్రేమనుండి ఎడబాపదు అనే సత్యాన్ని దృఢంగా నమ్మాను. 2 రాజులు 18:6 హిజ్కియా దేవుని ఆజ్ఞలను అనుసరించాడు. ఫిలిప్పు నపుంసకునికి దేవుని వాక్యం వివరించగానే, బాప్తిస్మమునకు నాకు ఆటంకమేమి? అని వెంటనే అంగీకరించిన విధంగా నమ్మి బాప్తిస్మం పొందిన వారు రక్షింపబడుదురనే సత్యాన్ని అనుసరిస్తు త్వరపడి పాస్టరుగారి ద్వార బాప్తిస్మ అనుభవ మును పొందాను. ఆ తర్వాత ఆత్మీయంగ బలపడ్డాను. అప్పటికి నాకు వాక్య వివరణ తెలియదు క్రైస్తవ విశ్వాసం లోతు అసలే అర్థం కాలేదు. సామాన్య పద్ధతిలో బైబిలంతా చదివేసాను. కొంచెం అర్థమయింది. 2తిమోతి 1:12, నేను నమ్మిన వానిని ఎరుగుదును గనుక నేను సిగ్గుపడను. నేను ఆయనకు అప్పగించిన దానిని ఆ దినము వరకు ఆయన కాపాడగలడని రూఢిగా నమ్ముకొనుచున్నాను. రోమా 8:31 యెహోవా నా పక్షమున ఉంటే నాకు విరోధి ఎవడు? దేవుని ప్రేమకు అంతంలేదు కృపకు హద్దులేదు. ఆయన శక్తికి ఎల్లలులేవు, చల్లని మన యేసుపేరట కృపను ఎల్లకాలము దేవుని నుండి పొందుతూనే ఉంటామనే నాలో ఒక ఆశ కల్గింది. హిజ్కియా సమాజాన్ని సంస్కరించాడు. 2 దిన వృత్తాం.29:3, 5 మనం సంపూర్ణంగా సమాజ శ్రేయస్సు కొరకు సంస్కరించడానికి సాధనములుగా వాడబడాలి. నా కుటుంబంలో నా బిడ్డలిద్దరి కుటుంబాలలో దేవుని మహిమ ఆధ్యాత్మిక ఆనందం, నూతన ఉజ్జీవము పునరుద్ధరించ బడింది. హిజ్కియాకు దేవుడు తోడుగా ఉండి జయం పొంది మరణకరమైన వ్యాధి నుండి తప్పించి ఆయుష్షు పొడిగించి నట్లు నాకు చేసారు. మబ్బు ముసిరినప్పుడే పాటకు సమయం, కన్నీరు కార్చిన వాడు కమ్మని పాట వింటాడు. క్రైస్తవ జీవితంలోని ఎన్నో ప్రధానమైన సద్గుణాలు మనకు అలవడడానికి దుఃఖమే కారణం. పరీక్ష పెట్టే శ్రమలు లేకుండా విశ్వాసమెక్కడిది? నా బాధల్లో దేవుని ఆదరణ స్పష్టంగా చూచాక, నా దృష్టిని సమాజ సేవ వైపు మరల్చాను.

మొదటిగా నా యింటిలో పనివాడు (ఇస్సాకు)తోనే ఆరంభించాను. అతడు చాలా శ్రమలో ఉన్నాడు. రెండు నెలలు అతనికోసం నిరంతరం విజ్ఞాపన చేశాను. గొప్ప అనుభవం కల్గింది. ఇస్సాకును ప్రభువు దర్శించారు. కలలో లేదా దర్శనంలో స్పష్టంగా సూటిగా మాట్లాడారు. దేవుడు నా పనివాడైన ఇస్సాకుతో యిలా మాట్లాడారు. “ఇస్సాకూ, నేను విమోచకుడను, రక్షకుడను. నీవు నీ పాపాల నిమిత్తము పశ్చాత్తాపపడి బాప్తీస్మం తీసికోవాలి. నీ మార్గం సరాళం కావాలంటే దేవుడు నీ నుండి నీ జీవితాన్ని కోరుకుంటు న్నాడు” అని ప్రబోధించారు. అతనికి కలలో తట్టలో పొట్టును యింటి నుండి బయటికి పారవేస్తున్నట్లు చూపించారు. అనగా తన హృదయంలో కల్మషాన్ని కడిగివేసి రక్షణ యిచ్చిన నిశ్చయతతో ఆ తర్వాత రోజే, మా సంఘ కాపరి ఆధ్వర్యాన బాప్తిస్మం తీసికొని రక్షణానుభవంలో మంచి విశ్వాసిగా క్రీస్తు బాటలో సాగిపోతున్నాడు. ఈ అనుభవం నాకు లేదు. గొల్లలకు దూత స్పష్టంగా చెప్పింది. జ్ఞానులకు తార దారి చూపింది. దేవుని పద్ధతులు మనవంటివి కావు.

లత కుటుంబం అమెరికాలో స్థిరపడిన తర్వాత వారంతా క్రమంగా ఆదివారం సంఘారాధనలో పాల్గొని రక్షణానం దాన్ని పొందటం నాకెంతో ఆనందం. విజయ వాడలో మా పాప వల్లిక కూడా ఎంతగానో విశ్వాసంలో ఎదిగింది. సంఘ కార్యక్రమాల్లో క్రమంగా పాల్గొంటూ అక్కడ వాక్యాలన్నీ నాకు ఫోను ద్వారా అందించడం. ఆత్మీయ సలహాలు యివన్నీ నా క్రైస్తవ యాత్రలో ఫలభరితమైన జీవితానికి తోడ్పడుతున్నాయి. ఫలభరితంగా ఫలించడానికి క్రీస్తులో అంటుకట్టబడాలి. ద్రాక్ష తీగ ఫలించకపోతే నరికి వేయాలి.

నా కుమార్తె లత డాక్టర్ ఉద్యోగం రీత్యా దూరంగా ఉండగా, నా మనుమడైన ప్రదీప్‌ను పెంచడానికి 6 నెలలకు ఒకసారి విజిటర్ వీసా మీద అమెరికా వెళ్ళడం, అక్కడ ఒంటరి సమయంలో బైబిలు పఠనం నాకెంతో ఆధారమైంది. ఒక సంవత్సరంలో జనవరి మొదలు మార్చి వరకు ఏడు సార్లు బైబిలు చదువగల్గాను. సంఘారాధనలో పాల్గొన్నాను. ఏకాంత ప్రార్థనలో బలంపొందాను. ఏ దేశమైనా క్రీస్తు ప్రేమ ఒక్కటే. నేను, నా యింటివారు నా యిద్దరు బిడ్డలు, యేసునే సేవించాలనేది నా ఆశ. ఆది 18:14లో దేవునికి అసాధ్యమేమన్నా కలదా? ఇదే నా నమ్మకం ఆ మాట నాకు స్ఫూర్తి,

నాకు పదేపదే జ్ఞాపకములో వచ్చే దైవ వాక్యము కీర్తనలు 92:12-15, నీతిమంతులు ఖర్జూరవృక్షమువలె మొవ్వ వేయుదురు...ఎదుగుదురు... వర్ధిల్లుదురు....... వారు ముసలి తనమందు ఇంక చిగురుపెట్టుచూ సారముకల్గి ఉందురు. ఈ వాక్యం నేను స్వతంత్రించుకున్నాను. నా రక్షణానుభవం యాదృచ్ఛికం కాని ప్రభువు చిత్తం ఉంది. ఎన్నో సార్లు బైబిలు చదివినందున దేవుడు నాకు జ్ఞానం దయచేశారు. ఏ భక్తులు వాక్యాలు చెప్పినను, ఎక్కడ ఉందో ఏ అధ్యాయమో అవగాహన కల్గి త్వరితముగా రెఫరెన్సు అందుకొనే భాగ్యం దేవుడు నాకు కల్గించారు. అది అందరూ గమనించగా నేను దేవుని మహిమ పరచగల్గుతున్నాను. “నా జీవిత కాలమంతయు నేను దేవుని మందిరములో నివసింపగోరుచున్నాను. నేను పాడెదను స్తుతిగానము చేసెదను” కీర్తనలు 27:4.

## గమనిక

**దయచేసి పత్రిక కొరకు మీరు పంపించే చందా మనియార్డర్ ద్వారా పంపదలుచుకుంటే ఈ క్రింద అడ్రసుకు పంపగలరు.**


**కె. ఇమ్మానియేల్ రాజేంద్ర,**
**ఎడిటర్, హన్నాకృప ఆధ్యాత్మిక మాసపత్రిక**
**6వ లైను, క్లాపేట, ఒంగోలు-523001**
**ప్రకాశం జిల్లా, ఫోన్: 9440217726**

## గమనిక

క్రైస్తవ కథలు, సాక్ష్యాలు, వ్యాసాలు, రచనలు, కవితలు, పాటలు మొదలగునవి మా ప్రియ పాఠకుల నుండి కోరడమైనది. ఆసక్తి గలవారు తమ తమ భావాలను మా పత్రిక ద్వారా పాఠకులకు అందించవచ్చు. క్రైస్తవ కథ ఏదైనా 2 పేజీలకు మించకూడదు.

# బైబిల్ ప్రాముఖ్యత

మొదట సువార్తలతో ప్రారంభించి, కీర్తనలు ఆ తదుపరి క్రొత్తనిబంధనలోని అన్ని పుస్తకములను లాటిన్ భాషలోనికి అనువదించాడు. ఈ లోపు తాను హెబ్రీ భాషను క్షుణ్ణంగా నేర్చుకొని క్రీ.శ.405 నాటికి పూర్తి బైబిలును భాషాంతరం చేశాడు. ఈ లాటిన్ బైబిల్ను వల్గేట్ (Vulgate) అన్నారు. మొదట్లో ఈ బైబిల్ అంతగా ఆదరణ పొందక పోయినా, రోము అధికారం క్రింద ఉన్న ప్రపంచమంతా విరివిగా వాడబడినది. పశ్చిమ ఐరోపాలోని దేశాలలో సువార్త ప్రకటించుటకు ఉపయోగించబడిన బైబిల్ ఇదే. ఇప్పటికి రోమన్ కాథోలిక్ సంఘము వారు ఈ వల్గేటును ఆధారం చేసుకొని భాషాంతరం చేయబడిన బైబిల్నే గుర్తించుచున్నారు.. చేతితో ఎత్తి వ్రాయబడిన లాటిన్ వల్గేట్. లారెన్టి యన్ లైబ్రరి ఆఫ్ ఫ్లారెన్స్ ఇటలీలో భద్రపరచబడి ఉంది.



16వ శతాబ్దం ఆరంభం వరకు పశ్చిమ ఐరోపాలోని ప్రజలకు అందుబాటులో ఉండుటకు బైబిలును వారివారి భాషలలోకి అనువదిం చారు. ఈ అనువాదములన్ని లాటిన్ వల్గేటును ఆధారము చేసికొని చేసినవి. అయితే కీర్తనలు, సువార్తలు, పది ఆజ్ఞలు, ముఖ్యమైన కథలు, రక్షణ సువార్త ఇలా కొన్ని భాగలను మాత్రమే అనువదించారు. వీటన్నిటికన్నా జాన్ విక్లిఫ్ (John Wycliffe)చే లాటిన్ వల్గేట్ నుండి 1330–1384లో తర్జుమా చేయబడిన ఇంగ్లీషు బైబిల్ మిన్నగా చెప్ప బడింది (Wycliffes Version). జాన్ విక్లిఫ్ మంచి మేధావియే కాక, మంచి బోధకుడు మరియు సంఘసంస్కర్త కూడా. విక్లిఫ్ చనిపోయిన తర్వాత తన సెక్రటరీ అయిన జాన్ పర్వే (John Purvey) (క్రీ.శ.1395 అదే ఇంగ్లీషు బైబిలును మరికొంత విపులంగా అనువదించాడు.

1456 సం॥లో మొట్టమొదటిగా లాటిన్ బైబిల్ (Gutenberg Edi- tion) అచ్చు వేయబడినది. తర్వాత పది సం॥లలో హెబ్రీ బైబిల్, గ్రీకు కొత్త నిబంధన మరియు సెప్ట్యూజియంట్ అచ్చు కాబడినవి. ఆ తర్వాత 1522లో మార్టిన్ లూథర్ జర్మనులకు అవసరమని కొత్తనిబంధనను, తర్వాత పాతనిబంధనను అనువదించాడు. విలియం టిండేల్ తన సమయమును, దేవుడు తనకిచ్చిన తలాంతులను తన ప్రజలైన ఇంగ్లాండు వారికై వెచ్చించి అందరికి అర్థమగు ఇంగ్లీషు భాషలోకి మొదట కొత్త నిబంధనను గ్రీకు బైబిలు నుండి తర్జుమా చేసి ముద్రించినాడు. ఈ ముద్రణకు పీటర్ స్కాఫర్ (Peter Schoffer) ఎంతో సహకరించి దాదాపు 6000 కాపీలు ముద్రించాడు. టిండేల్ పాతనిబంధనలోని ఐదు కాండములను, యోనాను ఇంగ్లీషులోకి అనువదించి ముద్రించినాడు. యెహోషువ నుండి 2దినవృత్తాంతముల గ్రంథములను కూడా అనువదించారు కాని తన మరణమునకు ముందు ముద్రించలేక పోయాడు.

టిండేల్ తప్పుడు బోధలు చేయుచున్నాడని అప్పటి సంఘం 17 నెలలు కారాగారంలో ఉంచి ఆ తర్వాత 1536 సం॥ అక్టోబర్ 6వ తేదిన గొంతునులిమి చంపి అతని శరీరాన్ని మంటతో కాల్చివేసెను. తన మరణ మునకు ముందే తన స్నేహితుడైన మైల్స్ కవర్ డేల్ (Miles Coverdale) పూర్తి ఇంగ్లీషు బైబిలును అచ్చు వేయించెను. అటు తరువాత థామస్ మాథ్యూ (Thomas Matthew) అను టిండేల్స్ స్నేహితుడు ఇదే టిండేల్స్ వెర్షనుకు కొన్ని మార్పులు చేసి తిరిగి అచ్చు వేయించాడు (1535). ఇదే రోజుల్లో హెన్రీ రాజు చర్చ్ ఆఫ్ ఇంగ్లాండ్లోని ప్రతి పారిష్ ను ఒక పూర్తి ఇంగ్లీషు బైబిల్ ఉండవలెనని ఆజ్ఞ ఇవ్వగా

థామస్ మాథ్యూచే రివైజ్ చేయబడిన టిండేల్ బైబిల్ ఆథరైజ్డ్ వెర్షన్‌గా ధృవీకరింపబడి ప్రతి పారిష్లోను వెలిసినది (1539). దీనినే గ్రేట్ బైబిల్ (Great Bible)గా అభివర్ణించారు.

జెనీవా, స్విట్జర్లాండు, స్కాట్లాండు ప్రాంతాలకు తరలి వెళ్ళిన ఇంగ్లీషు వారి కొరకు ప్రింటు చేయబడిన బైబిలు జెనీవా బైబిల్ (1560) అన్నారు. 1568లో మరియొక బైబిల్ ప్రింటు చేయబడినది. దీనిని బిషప్స్ బైబిల్ (Bishops Bible) అన్నారు. ఎందుకంటే దీనిని ఆది భాషలైన హెబ్రి, గ్రీకుల నుండి అనువాదము చేసిన వారిలో కొందరు బిషప్పులు, మిగిలిన వారు తరువాత బిషప్పులైనారు.

ఈ విధంగా Tindale, Coverdale, Great Bible, Geneva Bible మరియు Bishop Bible, King James Version అవిర్భవించుటకు కారణమైనవి. 1603లో King James VI Scotland సింహాసనమును అధిరోహించిన తర్వాత సంఘంలో అన్ని సమస్యలు చర్చించి, రూపుమాపుటకు ఒక కూడికను ఏర్పాటు చేశాడు. ఆ కూటమిలో క్రొత్త బైబిల్ భాషాంతరమునకై అవసరత ఏర్పడినట్లు గమనించారు. దీని ఫలితంగా 47 మంది పండితులు ఆరు గ్రూపులుగా విడిపోయి మూడు గ్రూపులు పాతనిబంధనను, రెండు గ్రూపులు క్రొత్తనిబంధనను, ఒక గ్రూపు అపోక్రిఫా (ఈ పుస్తకం ఇప్పుడు Protestant Bibleలో లేవు) మీదను పని చేసినవి. ఫలితంగా క్రీ.శ. 1611లో King James Versionగా మరియొక బైబిల్ ప్రింటు చేయబడినది.

అదే King James Versionను అర్ధంచేసుకొనుటకు మరికొంత సులభతరం చేస్తూ 130 మంది పండితుల సహాయంతో అందుబాటులో ఉన్న Hebrew, Greek భాషల బైబిలును, King James Versionను దగ్గర ఉంచుకొని 1982 నాటికి New King James Versionగా భాషాంతరం చేసిరి. ప్రపంచంలోని ఆంగ్లభాష మాట్లాడు ప్రజల కొరకు అతి సామాన్యమైన మానవులకు అందుబాటులో ఉండుటకు ఇలాంటి మరెన్నో భాషాంతరం చేయబడి ముద్రించబడినవి. Revised Standard Version, New English Bible, Amplified Bible, The Living Bible, The Good News Bible, New American Standard Version, New International Version లాంటివి క్రైస్తవులు విరివిగా వాడుచున్నారు. ఇలా చెప్పుకుంటూపోతే ఎంతో ఉంది. అయితే మన దేశంలో దాదాపు 18 భాషలు భారత ప్రభుత్వంచే గుర్తింపు గలిగినాయి. దాదాపు 1600 పైగా ఇతర భాషలు మనదేశంలో ఉన్నాయి.

తెలుగు బైబిలు చరిత్ర అను చిన్న పుస్తకములో (బైబిల్ సొసైటి వారిచే 'ముద్రింపబడింది) పరిశుద్ధ గ్రంథమును తెలుగులోకి అనువదించుట 1712లో మొదలైంది. జిగిన్బాగ్ అను మిషనరీ దక్షిణ ఇండియాకు వచ్చి క్రొత్త నిబంధన తర్జుమాను ప్రారంభించాడు. కాని దానినతడు ముగించకుండానే మరణించాడు. ఆ తర్వాత వచ్చిన ఘులి అను మిషనరీ 1719లో ప్రారంభించాడు. ఇతను చాలా భాషలు నేర్చిన పండితుడు. ప్రభువు ప్రార్ధనను ఇతను ఎనిమిది భాషలలోనికి తర్జుమా చేసి తాటాకు పత్రముల మీద వ్రాసి పంచి పెట్టెను. ఈయన బైబిలును తెలుగు భాషలోనే కాక హిందీ, తమిళ భాషలలోనికి అనువదించుటకు పూనుకున్నారు. ఈ విధంగా తర్జుమా చేసిన పాతనిబంధన వ్రాత ప్రతులను జర్మనీలోని తన University Libraryకి పంపించాడు. అయితే అక్కడ వారికి భాష తెలియక అశ్రద్ధగా దానిని ఎక్కడో ఉంచినారు. తరువాత ఎంత వాకబు చేసినను దాని విషయమై ఏమి తెలియలేదు. చాలా ఆసక్తికరమైన మరియొక విషయం ఏమిటంటే బైబిల్ సొసైటీ వారు అచ్చు వేయించిన పుస్తకంలో కెప్టెన్ దాన్సు అనే ఆయన ఈస్ట్ ఇండియా కంపెనీలో పని చేస్తుండే వాడు. ఆయన ప్రభువు చేత ప్రేరేపింపబడి దీక్షతో భారత దేశ భాషలు నేర్చుకొని నూతన నిబంధనను తెలుగులోకి తర్జుమా చేయ మొదలుపెట్టాడు. తను ఇంగ్లాండుకు సెలవు మీద వెళ్ళు సమయం వచ్చినప్పుడు, ఆ సెలవులను బైబిల్ తర్జుమాకు వెచ్చింప నిర్ణయించి తన తల్లికి ఒక లేఖ వ్రాశాడు. ఆ లేఖలో "అమ్మా! నేనిప్పుడే సెలవులకు నీ దగ్గరకు రాలేకపోవుచున్నాను.

**(సశేషం)**

6

# మదర్ తెరీసా

సాతానుకు సమయం చిక్కింది. ఎందరినో ప్రేరేపించి నరహంతకులుగా మార్చింది. ఏ విధమైన అల్లరి లేకున్నా హత్యలు మాత్రము నిశ్శబ్దంగా జరుగుతూనే వున్నాయి. కిరోసిన్‌తో తయారైన బాంబులు వేయడంతో గుడిసెలన్నీ కాలిపోయి ఎందరో మరణించారు. ఈ మారణకాండ ఐదురోజులు సాగింది. వేలకువేల ప్రజలు చనిపోయారు. కొందరైతే తమ వారిని కాపాడుకునే క్రమంలో చనిపోయారు. ఇలా జరిగిన నెల రోజులకు 1946 సెప్టెంబరు 10న మదర్ తెరిసా తన సంవత్సరాంత రిట్రీటు కొరకు డార్జిలింగ్ వెళ్లుటకు రైలు ప్రయాణానికి సిద్ధమైంది. ఇన్ని గొడవలు కలకత్తాలో జరుగుతుంటే మదర్ తెరీసా తాపీగా రిట్రీట్‌కని డార్జిలింగ్ బయలుదేరింది గదా అని కొందరు ఆమెను ప్రశ్నించారు. కాని ఆమె విధేయతను నేర్చుకున్న సెయింట్ ఇగ్నీషియస్ లయోలగారి ఆత్మీయ వ్యాయామాలు వాళ్ళకు తెలియవు గదా. శారీరకంగా మన శరీరానికి కావలసిన ఆహారం, వ్యాయామం ఎలాగో, అంతరంగంలోని ఆత్మను బలపరచటానికి సంవత్సరాంత రిట్రీటు ఎంతో అవసరం.

ఆమె రైలులో ఎక్కి వెళ్తూ చుట్టూ వున్న పొలాల గుండా రైలు కూతపెట్టి పెద్దశబ్దంతో దూసుకుపోతూ వున్న సమయాన ఒక్కసారిగా మరో పెద్దశబ్దం ఆమెకు వినబడింది. పేదవారి దగ్గరకు వెళ్లు, కాన్వెంటును విడిచిపెట్టు, నిరుపేద ప్రజలతో నివసించు. అది దేవుని స్వరమేనని మదర్ తెరీసా గుర్తించింది. ఏ మాత్రం అనుమాన పడలేదు. దేవుని పిలుపు కాన్వెంట్‌ని వదలి వెళ్లమని పేదలతో నివసించమని. కాని తను చేసిన వాగ్దానము కాన్వెంట్‌లోనే వుండి సేవ చేస్తానని. ప్రభువు చెప్పిన విధంగా బయట పేదలతో వుండాలంటే ఎలా వీలవుతుంది. ఈ విషయాలన్నిటిని తన రిట్రీటు సమయంలో ధ్యానంలో వుంటూ ప్రార్ధనచేసి ప్రభువు యొక్క జవాబు కోరింది. ఆమెకు అప్పుడు 36 సం॥లు. 17 సం॥లుగా రిట్రీటుకు వెళ్తుంది. ప్రతి సంవత్సరం సెయింట్ ఇగ్నీషియస్ లయోలగారు నియమించిన ఆధ్యాత్మిక అభ్యాసాలు. మొదటిగా ఆమె యొక్క పాపాల్ని ఒప్పుకొని, దేవుని క్షమాపణ వేడుకోవడం. క్రీస్తు ప్రభువు ఈ లోకంలో గొప్ప శక్తిమంతుడై పునరుత్థానశక్తితో వున్నాడనే సత్యంపై ధ్యానించుట.

ఆమెకు ఆజ్ఞాపింపబడినట్లుగా ఆమె కాన్వెంట్‌ను వదలి పేదవారితో జీవించుట ద్వారా వాళ్ళలో ప్రతి ఒక్కరికి చేయు సేవ క్రీస్తు ప్రభువుకు చేస్తున్నట్లు ఆనందించుటే తన భాగ్యము. ఇది తనకు ప్రభువు పిలిచిన పిలుపులో పిలుపు. కాని నాలుగు గోడల మధ్య వున్న తను ఎలా చేయగలదు. ప్రభువుకు ప్రార్ధన చేసింది. ప్రభువా, నేను కాదు చేసేది, చేయగలిగేది నీవే. నా భారము యావత్తు నీపైనే.

మదర్ తెరీసా అచంచలమైన విశ్వాసము ఎన్నడూ సన్నగిల్లలేదు. ఆమె నిజమైన విశ్వాస మహిళగా నిరూపించుకొనినది. అబ్రాహాము దేవుని వాగ్దానాన్ని నమ్మెను. ఆయన పిలుపుకు లోబడినాడు. అబ్రాహాము శోధింపబడి విశ్వాసమును బట్టి ఇస్సాకును బలిగా అర్పించెను. మృతులను సహితము లేపుటకు దేవుడు శక్తివంతుడని యెంచినవాడై, తన యేక కుమారుని అర్పించి ఉపమాన రూపంగా అతనిని మృతులలో నుండి మరల పొందెను. అటులనే కన్యయైన మరియ దేవుని మాటను విశ్వసించెను. ఆ మాట చొప్పున నాకు జరుగునుగాక అని తనకున్న శ్రేష్ఠమైన విశ్వాసాన్ని ప్రకటించుకొనినది. మదర్ తెరీసా యేసుప్రభువు పిలుపును విశ్వసించి పరిశుద్ధాత్మ నింపుదలతో ముందుకు సాగింది. దేవుడు దయచేయు వాడు అనునని ఆమె విశ్వాసము. ఎన్ని ఇబ్బందులు, అడ్డంకులు కలిగినను యేసుప్రభువు వైపు చూస్తూ ఆయననే సమాధాన కర్తయని విశ్వసించినది. ప్రభువు ప్రణాళికలో వున్న విషయాలకు మార్గము చూపేది దేవుడే. లోబడి ముందుకు సాగే బాధ్యత మనది. కనుక ఏ విషయములోను చింత పడనవసరం లేదు అని విశ్వసించి

ముందుకు సాగింది. నిజ విశ్వాసం నిర్జీవముగా వుండక బహు శక్తివంతమైనదిగా వుంటుందని మదర్‌కు తెలుసు. ఆ విశ్వాసమే హృదయానికి నిశ్చయతను కలుగచేస్తూ ముందుకు సాగిస్తుంది. దేవుని దృష్టిలో మానవ చరిత్ర అంటే ఆయనలో నమ్మకం వుంచిన వారి చరిత్ర నమ్మకమూ. అది సాధించిన కార్యాలే శాశ్వతంగా నిలిచేవి కాబట్టి అది ప్రాముఖ్యమైనది. లోకంలో మిగతాదంతా గతించిపోతుంది. నమ్మకం వెలుగును లోపలికి రానిచ్చే కన్నువంటిది. మదర్ తెరీసా జీవితం పైవిధమైన నమ్మకముతో కూడినదని ప్రపంచానికంతా తెలుసు.

డార్జిలింగ్ నుండి కలకత్తాకు తిరిగి వచ్చిన తరువాత తన పిలుపును గురించి ఫాదర్ సెలెస్ట్ వాన్ ఎగ్జెమ్‌గారికి తెలియపరిచింది. ఆ విషయమును విన్న ఫాదర్ ఎగ్జెమ్ ఆశ్చర్యపోయాడు. ఇంత చిన్న మహిళ కలకత్తా వీధులలో అంతటా రక్తసిక్తముగా వున్న పరిస్థితులలో పనిచేయుట ఎంత కష్టతరమని తలంచాడు. మదర్ తెరీసాతో మరి కొంత కాలము ప్రార్థనలో గడిపి ప్రభువును అడుగవలసిందిగా సలహా ఇచ్చాడు. మదర్ తెరీసా రిట్రీట్‌లో పరిశుద్ధాత్మ నడిపింపుతో తను తెలుసుకున్న విషయాలన్నీ తనకు కలిగిన ప్రేరణ, పిలుపు గురించి అంతా వ్రాసి ఆ పేపర్స్‌ను ఫాదర్‌కు అందజేసింది. ఆమె ఒక చీర కట్టుకుని భారతీయ సంప్రదాయం ననుసరించి నిరుపేద ప్రజల మధ్య సేవ చేయుటకు నిశ్చయించుకున్నట్లు వ్రాసింది. ఆ పేపర్స్ చదివి ఫాదర్ వాన్ ఎగ్జెమ్‌గారు ఆమెకిచ్చిన సలహా ఏమంటే నీవు రోమ్‌లో వున్న పోప్‌గారికి నీ యొక్క విశ్వాసాన్ని కొనసాగించుకోడానికి, మరియు నీవు చేసిన వాగ్దానాల నుండి విడుదలను కలుగజేయుటకు అనుమతి కోరుకునే అర్జీ పెట్టుకోమన్నారు. అప్పుడు మదర్ తెరీసా ఇంకేమైన ఇతర మార్గాలున్నాయా అని అడిగింది. ఆర్చ్ బిషప్‌గారి సలహా తీసుకుని నీకు మార్గాన్ని చూపించమని అడగమన్నారు. ఫర్దీనంద్ పెరియర్, అర్చ్ బిషప్‌గారు లొరిటో సంస్థను దర్శించినపుడు మదర్ తెరీసా తన అభిమతాన్ని వినవలసిందిగా కోరుకుంది. ఆమె తనలో వున్న విషయాలన్నీ చెప్పుకుంది. ఆర్చ్ బిషప్‌గారు ఓపిగ్గా అన్నీ విన్నారు. ఇలాంటి అభ్యర్థన ఇంతకు మునుపు తన వద్దకు వచ్చినందు వలన ఆర్చ్ బిషప్‌గారు అంతగా చలించలేదు. ఆయన ముఖంలో ఏ విధమైన మార్పు లేదు. ఏమి ఆలోచన చేస్తున్నదీ కన్పించలేదు. తనంతట తానుగా నిర్ణయం తీసుకోలేనని, రోమ్ నుండి అనుమతి లభించవలసి వుందని మాత్రము చెప్పారు. దేవునికి ఏదైనా సాధ్యమేనని మాత్రము చెప్పారు.

అదే సమయంలో మదర్ తెరీసాను అసన్‌సోల్ పట్టణానికి మెడికల్ చెకప్ కొరకు పంపారు. ఆమెకు ఊపిరితిత్తుల వ్యాధి వుందేమోననే అనుమానంతో ట్యుబర్క్యులోసిస్ టెస్ట్ కొరకు పంపారు. కాని లేదని తేలింది. అచ్చట నుండి తిరిగి వచ్చినపుడు హిందూ, ముస్లీంల మధ్య గొడవలు జరుగుతున్నాయి. మదర్ తెరీసా ఆ ఇద్దరు మతాల నాయకుల్ని పిలిచి సఖ్యత చేసి పంపారు. అందరు ఎంతో సంతోషించారు. ఆర్చ్ బిషప్‌గారు తన మనవిని పట్టించుకోలేదని మదర్ భావించారు. 40 సంవత్సరాలు సేవ చేసి కూడా ఆర్చ్ బిషప్‌గారికి నిరుపేదలపట్ల అవగాహనలేదని అనుకున్నది. అలాగని ఆయన్ని తీర్పు తీర్చలేదు. మదర్ తెరీసా అభ్యర్థనకు ముందు వేరొకరు అదే అభ్యర్థన చేసి ఒక సంవత్సర గడువులో తన నిర్ణయాన్ని కొనసాగించి స్థిరపడతారో లేదో అని చూచినపుడు ఆమె తన మనసు మార్చుకొనుట జరిగినది. అదే విధంగా మదర్ తెరీసా కూడా చేస్తుందా అని ఆర్చ్ బిషప్‌గారు ఆలోచించారు. ఆర్చ్ బిషప్‌గారు మదర్ తెరీసాను పిలిచి నీవు అనుకున్న నిరుపేద సేవను డాటర్ ఆఫ్ ఆన్నె సంస్థతో కొనసాగించవచ్చుగదా అని సలహా ఇచ్చారు. ఆ సలహా మేరకు వారితో తను కోరిన సేవా కార్యక్రమాల్ని చేయాలని ప్రయత్నించినపుడు తాను కోరిన విధంగా జరుగక పోవడము చూసి, ఆర్చ్ బిషప్‌గారితో సిస్టర్స్ ఆఫ్ ఆన్నే వారు తమ పద్ధతితో సేవ చేస్తున్నారుగాని, తాను అనుకున్న సేవ వారితో సఫలమవుట కష్టమని చెప్పింది. ఆర్చ్ బిషప్‌గారు నీవు అనుకున్నవన్ని ఒక్కరోజులో జరుగవు. నీవు కొత్త మిషనరీ మొదలు పెట్టాలంటే రోమ్ నుండి పర్మిషన్ అవసరము. **(సశేషం)**

# తల్లిదండ్రులారా!

మీరు ఇల్లు కట్టుకుంటున్నారనుకోండి, అది పూర్తయ్యే వరకు అంటే, పునాది తీసిన దగ్గర్నుండి, గృహప్రవేశం చేసే వరకు మీ మనసంతా ఇంటి నిర్మాణం మీదనే ఉంటుంది. మీ దగ్గరున్న డబ్బునిబట్టి సాధ్యమైనంత వరకు నాణ్యమైన వాటినే ఇంటికి సమకూరుస్తారు. నాశిరకమైన వాటిని మీ ఇంటి నిర్మాణానికి వాడటానికి మీ మనస్సు అంగీకరించదు. ఎందుకంటే, మీరు అందులో నివసిస్తారు కాబట్టి, భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఉండటానికి ఇప్పటి నుండే చాలా జాగ్రత్తలు తీసుకుంటారు. ఒకవేళ మీరు అప్పుచేసి ఇల్లు కట్టారనుకోండి, ఆ బాకీ తీర్చలేనప్పుడు, అప్పు ఇచ్చిన వారు, 'ఇల్లు మీరు ఉంచేసుకోని, మీ పిల్లలను మాకు ఇవ్వండి' అని అడిగితే, ఇంటినైనా వదులుకుంటారు కానీ, పిల్లలను మాత్రం ఇవ్వరు. అది కన్నప్రేమ. ఎంతో సమయం వెచ్చించి, అహర్నిశలు కష్టపడి, మీ కష్టార్జితంతో కట్టుకున్న మీ ఇంటి కంటే, బిడ్డలకే విలువ ఇస్తున్నప్పుడు, మరి మీ బిడ్డల జీవితాన్ని కట్టడానికి మీరు ఎంత సమయం వెచ్చిస్తున్నారు? మీ బిడ్డల భవిష్యత్తును ఏ పునాది మీద కడుతున్నారు? దేవుడు అనే పునాది మీద కడుతున్నారా? ధనము అనే పునాది మీద కడుతున్నారా? ఒకవేళ మీరు మీ బిడ్డల భవిష్యత్తు కోసం ధనమును సమకూరుస్తున్నట్లయితే, *"భూమి మీద మీ కొరకు ధనమును కూర్చుకొనవద్దు" (మత్తయి 6:19), "ధనాపేక్ష సమస్తమైన కీడులకు మూలము" (1తిమోతి 6:10), "ధనమును నమ్ముకొనువాడు పాడై పోవును" (సామెతలు 11:28)* అని బైబిలులో వ్రాయబడిన వాక్యములపట్ల మీ అభిప్రాయం ఏంటి? ఈ సమాజంలో ధనవంతులైనవారు, వారి పిల్లలు దేవునియందలి భయ భక్తులతో క్రమమైన మార్గంలో ఉన్నవారిని మీరెరుగుదురా? *"మీరు దేవునికిని సిరికిని దాసులుగా ఉండనేరరు" (మత్తయి 6:24)* అని యేసుప్రభువు చెప్పాడు కదా. క్రైస్తవులైన మీరు క్రీస్తు మాటలను విశ్వసిస్తున్నారా? ఒకవేళ విశ్వసిస్తే మీ బిడ్డలను దేవునికి దాసులుగా ఉండేలా పెంచుతారు. లేదంటే వారు డబ్బుకి దాసులైపోతారు. ధనాపేక్ష కలిగి, ధన సంపాదనలో నిమగ్నమై, అనుక్షణం డబ్బు జపం చేసే వారి బిడ్డలు **'సిరి'**కి దాసులైపోతారు. దాని పర్యవసానం అనుభవిస్తున్నప్పుడు గానీ తెలియదు వారి తప్పు ఏంటో. పసితనం నుండి వారికి ఏమి నేర్పించకూడదో అవి వారికి నేర్పిస్తూ, వారు పెద్దయ్యాక తలపట్టుకుంటే ప్రయోజనమేముంటుంది? వారు మీ చేయి దాటిపోయే వరకు మీ బిడ్డలను చూసి మురుసుకుంటూ, గారాభం చేసి, తర్వాత బాధపడే కంటే, వారి భవిష్యత్తుని దృష్టిలో పెట్టుకొని, కష్టమైనా సరే, దేవుని సంబంధమైన క్రమశిక్షణలో పెంచాలి. *"బెత్తము వాడనివాడు తన కుమారునికి విరోధి, కుమారుని ప్రేమించువాడు వానిని శిక్షించును" (సామెతలు 13:24).* 'బెత్తము' అంటే కర్ర తీసుకొని చావబాదమని కాదుగానీ, బిడ్డలను క్రమశిక్షణలో పెంచే క్రమంలో కొంత కఠినమైన వైఖరిని వారిపట్ల అనుసరించాలి. వారి ప్రతి నిర్ణయాన్ని సమర్ధించి, వారి ప్రతి కోరికను అనుమతించడమనేది **'ప్రేమ'** కాదు. అది గారాభం అవుతుంది. గారాభంగా పెరిగిన పిల్లలలో క్రమశిక్షణ అనేది అరుదుగా ఉంటుంది. గారాభం చేయడం వలన వారి జీవితం అదుపు తప్పుతుంది. *"బెత్తమును గద్దింపును జ్ఞానము కలుగజేయును, అదుపులేని బాలుడు తన తల్లికి అవమానము తెచ్చును" (సామెతలు 29:15).* **'దేవుని సంబంధమైన క్రమశిక్షణలో మీ పిల్లలు పెరగటం దేవుని చిత్తమై యున్నది'**.

మీ బిడ్డలు దేవుని ప్రణాళికలో భాగంగా ఈ భూమి మీదకు పంపబడ్డారని మీకు తెలుసా? భార్యాభర్తల సంపర్కంలో తండ్రి నుండి వెలువడే కొన్ని కోట్ల కణాలలో తల్లి అండము కేవలం ఒక్క కణమును మాత్రమే స్వీకరిస్తుంది. చాలా అరుదుగా రెండు మూడు కణాలను స్వీకరిస్తుంది. అంటే, తండ్రి నుండి విడుదలైన కొన్ని కోట్లమంది మనుష్యులలో కేవలం ఒక్క మనిషికి మాత్రమే తల్లి జన్మనిస్తుంది. అంటే, మిగిలిన కొన్ని కోట్ల కణాల రూపంలో

ఉన్న బిడ్డలను కాదని, మీ బిడ్డలు దేవుని ప్రణాళికలో భాగంగానే ఈ భూమి మీదకి వస్తారు. అయితే దేవుని ప్రణాళిక మీ బిడ్డలపట్ల నెరవేరకుండా చేయడానికి, ఎవనిని మ్రింగుదునా అని గర్జించే సింహంలా కాచుకొని కూర్చున్న సాతాను, దేవుని ప్రణాళికను కాదని, మీ బిడ్డలపట్ల మీకొక ప్రణాళిక ఉండేలా చేస్తుంది. అందుకే బిడ్డ తల్లి గర్భములో పడగానే, తల్లిదండ్రులు ఆ బిడ్డ గురించి రక రకాల ప్రణాళికలు వేసుకుంటుంటారు. మీ బిడ్డలు సంపూర్ణ ఆరోగ్యంతో ఈ భూమి మీదకు రావడానికి దేవుడే కదా కారణము. *"నేను రహస్యమందు పుట్టిననాడు భూమియొక్క అగాధస్థలములలో విచిత్రముగా నిర్మింపబడిననాడు నాకు కలిగిన యెముకలును నీకు మరుగై యుండలేదు. నేను పిండమునైయుండగా నీ కన్నులు నన్ను చూచెను. నియమిం పబడిన దినములలో ఒకటైన కాకమునుపే నా దినము లన్నియు నీ గ్రంథములో లిఖితములాయెను" (కీర్తనలు 139:15,16).* అయినప్పటికీ మీ బిడ్డలు ఈ భూమి మీదకు రావడానికి దేవుని ప్రమేయము, ప్రణాళిక ఏమీ లేనట్లు, మీ స్వంత ఆలోచనలతో బిడ్డలను పెంచుతూ, మీ బిడ్డలపట్ల దేవునికి ఉన్న ప్రణాళికను నెరవేరకుండా మీరే అడ్డుకొని సాతాను చేతుల్లో పెడుతున్నారు. మీ పిల్లలు దేవుడంటే ఆసక్తి లేకుండా, టీ.వి., సెల్‌ఫోన్, ఇంకా వినోద కార్యక్రమా లకు బానిసలవ్వడమనేది దేవుని ప్రణాళికలో భాగమవు తుందో, సాతాను ప్రణాళికలో భాగమవుతుందో మీరే ఆలోచించండి. ఈ భూమి మీద పుట్టే ప్రతిఒక్కరూ దేవుని బిడ్డలే, తల్లిదండ్రులు కేవలం సంరక్షకులు మాత్రమే. దేవుని బిడ్డలకు సంరక్షకులుగా ఉన్న మీరు, వారిని దేవుని ఇష్టానికి వ్యతిరేకంగా ఈ లోకానుసారంగా పెంచితే దేవుడు చూస్తూ ఊరుకుంటాడా? ఈ భూమి మీద ఏ ఒక్క చిన్నబిడ్డ నశించి పోయినా దానికి కేవలం వారి తల్లిదండ్రులే బాధ్యత వహించాల్సి ఉంటుంది. వారు దేవుని చిత్తానికి వ్యతిరేకంగా ప్రవర్తిస్తున్నారని గుర్తుంచుకోవాలి. *"ఈ చిన్నవారిలో ఒకడైనను నశించుట పరలోక మందున్న మీ తండ్రి చిత్తముకాదు" (మత్తయి 18:14).* బిడ్డలను నిర్లక్ష్యం చేసే వారిపట్ల యేసు ప్రభువు ఎంతటి కఠినమైన వైఖరి కలిగియున్నాడంటే, *"నాయందు విశ్వాసముంచు ఈ చిన్నవారిలో ఒకనిని అభ్యంతరపరచువాడెవడో, వాడు మెడకు పెద్ద తిరుగటిరాయి కట్టబడినవాడై మిక్కిలి లోతైన సముద్రములో ముంచి వేయబడుట వానికి మేలు" (మత్తయి 18:6).* చిన్నబిడ్డలపట్ల దేవునికి ఉన్న ప్రణాళిక నెరవేరకుండా, బిడ్డలను దేవుని దగ్గరకు రాకుండా అభ్యంతరపరిచే వారి మెడకు పెద్ద తిరుగటిరాయి కట్టి, **'మిక్కిలి'** లోతైన సముద్రంలో ముంచి వేయబడుటే మేలని యేసుప్రభువు చెప్పాడు. ఇది ఎంతటి తీవ్రమైన శిక్షో ఆలోచించండి. బిడ్డలను దేవునిలో పెంచ కుండా నిర్లక్ష్యం చేసేవారిని ఎంత కఠినంగా శిక్షించాలో యేసుప్రభువు చెప్తున్నాడు. కాబట్టి తల్లిదండ్రులారా, మీ బిడ్డలపట్ల నిర్లక్ష్య వైఖరిని విడిచి, దేవునిలో ఎదిగేలా పెంచండి. **ఇది మీ బిడ్డలపట్ల దేవుని చిత్తమై యున్నది.**

**(సశేషం)**


# ఇంటర్నెట్‌లో తెలుగు బైబిల్

**మీరు ఎక్కడున్నా సరే, మీ స్మార్ట్ ఫోన్, ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్‌లలో తెలుగు బైబిల్ చూడవచ్చును. అంతేకాక తెలుగు-ఇంగ్లీషు ప్యారలల్ బైబిల్, తెలుగు ఆడియో బైబిల్, తెలుగు బైబిల్ ఎన్‌సైక్లోపీడియా, తెలుగు ఆడియో, వీడియో పాటలు, తెలుగు పాటల రచనలు, అద్భుత సాక్ష్యములు, బైబిల్ వాల్‌పేపర్స్, తెలుగు క్రైస్తవ పుస్తకములు ఇంకా మరెన్నో మీ కోసం... నేడే దర్శించండి...**

**www.onlinetelugubible.net**

# నేత్రాశ

'హన్నాకృప' పాఠకులకు, మన ప్రభువైన యేసుక్రీస్తు నామమున మీకందరికి నా శుభములు.

శరీరము నిత్యం ఏదో ఒకటి కోరుకుంటూనే ఉంటుంది. సుఖము అనేది శరీరానికి సంబంధించినదే. శరీరాశ మన శరీరానికి అవసరమైన వాటిని, అంటే ఆహారము, వస్త్రము, ఇంకా అవసరమైన వాటిని కోరుకుంటుంది. అయితే శరీరంలో ఒక భాగమైన కన్నుకి ప్రత్యేకమైన ఆశలుంటాయి. శరీరాశ మన పరిధికో లోబడి ఉంటుంది. నేత్రాశ అనేది మన పరిధికి మించి, మనకి అవసరం లేనివాటిని కూడా కోరుకుంటుంది. జీవపు డంబము అనేది నేత్రాశ వలన కలుగుతుంది. అందమైనవి కావాలనుకోవడం నేత్రాశ, ఖరీదైనవి కావాలనుకోవడం జీవపుడంబము. ఈ నేత్రశ వలన మనుష్యులు ప్రమాదకరమైన పరిస్థితులను ఎదుర్కొం టుంటారు. మనం గొప్పగా బ్రతకాలనే ఆశ మన కన్నుల వలననే కలుగుతుంది. 'దేహమునకు దీపము కన్నే గనుక నీ కన్ను తేటగా ఉండిన యెడల నీ దేహమంతయు వెలుగు మయమైయుండును' (మత్తయి 6:22) మనం గ్రుడ్డివాళ్ళ మైతే కళ్ళుంటే బాగుండు అని ఆశపడతామే తప్ప మనకు ఎలాంటి ఆశలుండవు. గ్రుడ్డితనము చాలా భయంకరమైనది. చీకటిలో జీవించటం నరకంగా ఉంటుంది. శరీరంలో ఏ భాగము పనిచేయక పోయినా పుస్తకం చదువుతూనో, ప్రకృతిని చూస్తూనో కాలం గడపొచ్చు. కళ్ళు లేకపోతే ఏ పనీ చేయలేరు. ఇతరుల మీద ఆధారపడుతూ అంధకారంలో గడపాల్సి వస్తుంది. ఒకటి, రెండ్రోజులు మనం కళ్ళకి గంతలు కట్టుకొని జీవిస్తే అర్థమవుతుంది అలాంటి జీవితం ఎంత దుర్భరంగా ఉంటుందో. మన దేహానికి వెలుగునిచ్చేది కన్ను. అదే కన్ను మన దేహాన్ని నరకానికి పంపిస్తుంది. ఈ లోకంలో మనం పాపము చేయడానికి కళ్ళు మనల్ని పురికొల్పుతాయి. సాతాను యేసుప్రభువుకు ఈ లోక రాజ్యాలన్నిటిని చూపించి, నీవు నాకు సాగిలపడిన యెడల వీటన్నిటిని నీకిస్తానని నేత్రాశ విషయంలో శోధించింది. యేసుప్రభువును శోధించిన సాతాను నిన్ను నన్ను కూడా శోధిస్తుంది. ఈ లోకములో జీవిస్తున్నప్పుడు ప్రతి మనిషికీ శరీరాశ, నేత్రాశ, జీవపుడంబమనే విషయాలలోనే శోధనలు వస్తాయి. ఈ లోక భోగాలను చూసి వాటిని సంపాదించుకో డానికి మనకై మనమే సాతానుకు లొంగిపోయి దాసులమై పోతున్నాము. ఏదెను తోటలో హవ్వని సాతాను శోధించి నప్పుడు దేవుడు తినవద్దని చెప్పిన పండు హవ్వ కన్నులకు అందమైనదిగా కనబడింది. అందమనేది కంటికి సంబం ధించినది. కళ్ళు అందాన్ని కోరుకుంటాయి. అందుకే అందము మోసకరమని వ్రాయబడింది. 'నీ కుడికన్ను నిన్ను అభ్యంతరపరచిన యెడల దాని పెరికి నీ యొద్ద నుండి పారవేయుము; నీ దేహమంతయు నరకములో పడవేయ బడకుండ నీ అవయములలోనొకటి నశించుట నీకు ప్రయోజనకరము గదా' (మత్తయి 5:29). కాబట్టి మన కళ్ళ వలన మన దేహము నరకములో పడకుండా వాక్యము మన కళ్ళ ముందు కనబడేలా వాక్యానుసారంగా జీవిద్దాం. దేవుడు మనకందరికి కృప దయచేయునుగాక. ఆమేన్.

–ఇట్లు **డా॥ సుష్మ ప్రశాంత్, నెల్లూరు**


## కొడవటికంటి రచనలు

**అపొస్తలుడు –** **రూ. 250/-**
(అపొస్తలుడైన పౌలు కథ – నవల)

**జప్నత్పనేహు –** **రూ. 250/-**
(యోసేపు కథ – నవల)

**నా చిత్తానుసారుడు** **రూ. 250/-**
(దావీదు కథ – నవల)

**మిక్కిలి సాత్వికుడు** **రూ. 150/-**
(మోషే కథ – నవల)

**గోత్రకర్త** (యాకోబు కథ–నవల) **రూ. 250/-**

# నా కుటుంబము



**భార్య, భర్త, పిల్లలు కలిసి ఒకే చోట ఉంటే దానిని కుటుంబము అంటారు. పిల్లలు ఉన్నా లేకపోయినా భార్యా భర్తలు కలిసి జీవిస్తున్నా కుటుంబమనే అంటారు. కుటుంబ వ్యవస్థ అనేది దేవుని ప్రణాళికలో భాగమే. కుటుంబ వ్యవస్థలో స్త్రీ ప్రధాన భూమిక పోషిస్తుంది.**

---

యేసుప్రభువు ఈ లోకానికి వచ్చుట ద్వారా సమస్త పాపములకు ప్రాయశ్చిత్తము జరిగి కుటుంబము సమాధాన పరచబడింది. సర్వసృష్టి అందులోని మానవులందరు ఒకే కుటుంబము అనుకోకపోయినా, మానవజాతి మనుగడకు కుటుంబమే ప్రధాన మైనది. కుటుంబాల ద్వారా సంఘము ఏర్పడింది. కొంతమంది దొంగలు కుటుంబాలుగా జీవించే చోటును సెటిల్మెంటు అన్నారు. కొందరు పూజారుల కుటుంబాలు కలిసి జీవించే చోటును అగ్రహారము అన్నారు.

ఒక ఊరిలో, ఒక వీధిలో ఎప్పుడూ తగదాలే. ఎందుకు? తగాదాలు కోరుకునే వారందరు అక్కడ చేరారు అన్నమాట. ఒక ఇంట్లో ఎప్పుడూ తగాదాలే. ఇంటికి వచ్చిన కోడలు అలాంటిది. ఆ కుటుంబములోని వారంతా సాధువులైనా, వచ్చిన కోడలుకు తగాదా లేనిదే తోచదు. అందుకనే పూర్వం వధువు కొరకు పరాయి ఇంటికి పోయేవారు కాదు.

ఎలిమెంటరీ రోజుల్లో మా పాఠ్యపుస్తకాలలో 'నీతి'కి ఎక్కువ ప్రాధాన్యత ఉండేది. "అది మా పని కాదు" అనే పల్లకి బోయీల పాఠం, "మా తండ్రి కొరకు" అనే కుటుంబ నీతి కథ వుండేవి.

ఒక యింట్లో మనుమడు, తండ్రి, తాత ఉండేవారు. తాత రోజూ భోజనానికి వచ్చేటప్పుడు అన్నం తినటానికి అతను మట్టి మూకుడు తెచ్చుకొని అన్నం పెట్టించుకొని వెళ్ళేవాడు. అయితే తండ్రి, అతని పిల్లలు మంచి కంచు వాటిలో భోజనం చేసేవారు. ఆ యింట్లో మనుమనికి ఈ పద్ధతి నచ్చలేదు. నేటి తన తండ్రి రేపు తన ఇంట్లో తాత అవుతాడని తెలుసుకోవాలని ఒకరోజు తాతని మట్టిబొచ్చె పదిమందిలో జారవిడువమన్నాడు. తాత అలాగే చేసినప్పుడు ఆ మట్టి పాత్ర పగిలిపోయింది. మనుమడు పరుగెత్తుకొని వచ్చి 'అయ్యయ్యో తాత! రేపు మా నాన్నకి నేను భోజనం పెట్టటానికి మట్టి పాత్ర అయినా లేకుండా చేశావే!' అన్నాడు.

నేననుకుంటాను ఎంత వృద్ధురాలైనప్పటికీ తన తల్లికి తను కొనే చీరకి తన భార్యకు తను కొనే చీరకు తారతమ్యాలు ఉంటే తల్లిని తండ్రిని సన్మానించుము అనే ఆజ్ఞను మీరినట్లే! తన చిన్న కుమారుని ప్రేమించే ప్రేమకు తన తండ్రి యెడల చూపే ప్రేమకు బేధము కనపరచినా పై ఆజ్ఞను మీరినట్లే.

ఒక సంగతి మనం ఎప్పుడూ మరచిపోకూడదు. మనం స్త్రీగా పుట్టినా, పురుషునిగా పుట్టినా అది మన చేతిలో లేని పని. కాని మనమందరము కోరుకొనేది దీర్ఘాయుష్షు. ఆ దీర్ఘాయుష్షు దేవుడిస్తే మనం ముసలివాళ్ళ మవ్వాల్సిందే. కాబట్టి వృద్ధాప్యంలో సంతోషంగా ఉండాలంటే ఇప్పుడు మన ఇంట్లోవున్న వృద్ధులను సంతోషంగా ఉంచాలి.


"కావున మనుష్యులు మీకు ఏమి చేయవలెనని మీరు కోరుదురో ఆలాగుననే మీరును వారికి చేయుడి. ఇది ధర్మశాస్త్రమును ప్రవక్తల ఉపదేశమునైయున్నది".

శ్రీమతి పులుకూరి సుగుణమ్మగారు నా ఆత్మీయ అక్క. 1952లో నాకు పన్నెండు సంవత్సరాల వయస్సులో నేను ఒంగోలు వచ్చినప్పుడు అప్పుడు హెచ్.సి.యం. లో చదువుతూ మాకు సండేస్కూలు తీసుకునేవారు. తరువాత అదే స్కూల్లో టీచర్‌గా పనిచేసి రిటైరయ్యారు. ఆమె చక్కగా చిత్రలేఖనం చేసేవారు. 2008 ఆగష్టు నెలలో ఆమె ప్రభువు సన్నిధికి చేరింది. తరువాత నేను ఆమె వ్రాసిన ప్రసంగాలన్నీ చదివాను. పది నెలలుగా 'నా కుటుంబము' సంపాదకీయంగా ప్రచురిస్తున్నాము. శ్రీమతి సుగుణమ్మగారి రచన 'చిన్నచూపు' కుటుంబ వ్యవస్థపై వ్రాసింది కనుక సంపాదకీయం ధారావాహికలో పదకొండవదిగా ప్రచురించాము.

**(సశేషం)**

## ఈ నెల ప్రశ్న - సెప్టెంబర్-2025

**అబ్రాహాము తండ్రియైన తెరహు కుటుంబీకులు ఏ నది అవతల నివసించిరి? (యెహోషువ)**




మీ జవాబు (రెఫరెన్సుతో సహా) ఈ నెల 15వ తేదీలోపు 9440217726 నంబరుకి వాట్సాప్ ద్వారా మాత్రమే పంపించాలి. సరైన సమాధానం పంపిన వారిలో **'లక్కిడిప్'** ద్వారా ఒకరిని ఎంపిక చేసి వారికి రూ.250/-లు విలువ చేసే **'అపొస్తలుడు'** అనే పుస్తకం బహుమతిగా ఇవ్వబడుతుంది. అయితే ఈ అవకాశం కేవలం **'చందాదారులకు మాత్రమే'**. అనగా చందా చెల్లించిన వారు (చందాదారుల పట్టికలో పేరు ఉన్నవారు) ఈ ప్రశ్నకు జవాబు పంపించాలి. 15వ తేది లోపు చందా చెల్లించేవారు కూడా పాల్గొనవచ్చును. ఈ క్రింది బాక్సులో జవాబు, మీ పేరు, బుక్ సీరియల్ నంబరు వేసి ఫోటో తీసి వాట్సాప్ ద్వారా పంపించాలి. పేరు, సీరియల్ నంబరు లేకపోతే వారి పేరు లక్కిడిప్‌లో చేర్చబడదు.

జవాబు.......................................................

పేరు...........................................................

గ్రామము................బుక్ సీరియల్ నంబరు...........

**సెప్టెంబరు-2025 ప్రశ్న జవాబు :**
**మోసేరులో (ద్వితీయోపదేశకాండము 10:6)**

(జవాబు మరియు రెఫరెన్సు తప్పని సరిగా వ్రాయాలి)

**జవాబులు పంపినవారు :**

1. జి. ఏంజల్ పౌలాస్-ఒంగోలు, 2. టి. క్రిస్టియానమ్మ-నందికొట్కూరు, 3. జె. రాజకుమారి-గుంటూరు, 4. వై. సంధ్యారాణి-ఒంగోలు, 5. కె. మేరిపవిత్ర-మంచిర్యాల,

### చందాదారుల వివరములు

| | | |
|---|---|---|
| కర్మేల్ హెల్త్‌కేర్, పులివెందుల | (08-07-25) | 5000 |
| డా॥ బి. ప్రజ్వలిత్ రూబేన్, హన్మకొండ | (12-10-24) | 5000 |
| రెవ.డా॥ వి. విజయకుమార్, బొబ్బిలి | (15-01-24) | 5000 |
| రావెల ప్రసాదరావు, గుంతకల్లు | (21-06-24) | 5000 |
| మేరిసలోమి, సిరివెళ్ళ, కర్నూలుజిల్లా | (29-11-22) | 5000 |
| బి. ప్రభువరకుమార్, రామన్నపేట | (24-06-25) | 3000 |
| కె. రజిని, నరసరావుపేట | (15-06-25) | 3000 |
| డా॥ క్రిస్టియన్ సిరప్ప, అనంతపూర్ | (06-07-24) | 3000 |
| యు. అనిత, సిరివెళ్ళ | (06-12-24) | 3000 |
| రావెల ప్రసాదరావు, గుంతకల్లు | (22-08-25) | 2000 |
| పి. జయదేవి, గుంటూరు | (03-07-25) | 2000 |
| వై. సంధ్యారాణి, ఒంగోలు | (04-01-25) | 2000 |
| పి.వి.కెరోలిన్, గుంటూరు | (11-12-24) | 2000 |
| డా॥ సిహెచ్‌కె. సుష్మప్రశాంత్, నెల్లూరు | (22-01-24) | 1500 |
| కొడవటికంటి అశోక్‌కుమార్, ఒంగోలు | (09-08-25) | 1000 |
| రావెల ప్రసాదరావు, గుంతకల్లు | (27-03-25) | 1000 |
| జి. కమలాకర్, ఒంగోలు | (03-03-25) | 1000 |
| శ్రీమతి రూతు హోసన్న, కావలి | (09-11-24) | 1000 |
| జి.మాణిక్యమ్మ అనంతపురం | (25-03-24) | 1000 |
| యం. విల్సన్ సామ్యేల్, నెల్లూరు | (08-09-25) | 500 |
| డి. శ్యామ్‌సిన్హా, బాపట్ల | (04-09-25) | 500 |
| ఆర్. జయమ్మలాబాను, గుంతకల్లు | (16-07-25) | 500 |
| జి. జార్జిథామస్, దుగ్గిరాల | (12-03-25) | 500 |
| కె. ప్రకాశరావు, నరసరావుపేట | (14-01-25) | 500 |
| బి. నెహెమ్యా, చిన్నగంజాం | (25-12-24) | 500 |
| బి. జయరావు, బుచ్చిరెడ్డిపాలెం | (06-11-24) | 500 |
| డి. నాగేశ్వరరావు, సంతరావూరు | (10-11-24) | 500 |
| కె. కమల్, మంచిర్యాల, తెలంగాణ | (14-10-24) | 500 |
| కె. ఆదిలక్ష్మి, డిస్ట్రిక్ట్ లైబ్రరి, ఒంగోలు | (24-09-24) | 500 |
| కె. ఐజక్‌సుకుమార్, ఒంగోలు | (14-08-24) | 500 |
| బి. సరోజిని, గుంతకల్లు | (06-05-25) | 400 |
| టి. క్రిస్టియానమ్మ, నందికొట్కూరు | (08-09-25) | 350 |
| పి. స్వప్న, పాల్వంచ | (09-08-25) | 350 |
| మారనాత బైబిల్ సెమినరీ, విజయవాడ | (06-08-25) | 350 |
| జి. ఏంజల్ పౌలాస్- ఒంగోలు | (02-08-25) | 350 |
| జి. రవి, వేల్పూరు | (12-07-25) | 350 |
| స్వయంప్రభ, చిలకలూరిపేట | (14-06-25) | 350 |
| యస్. రాజశేఖర్, కర్నూలు | (04-06-25) | 350 |
| జి. దేవదాసు, నంద్యాల | (05-04-25) | 350 |
| జి. కళావతి జాకబ్, ఒంగోలు | (03-04-25) | 350 |
| ఆర్.ఆర్.కె.పీటర్-విశాఖపట్నం | (23-03-25) | 350 |
| పి. జాన్‌బాబు-గోపాలపురం | (21-03-25) | 350 |
| ఎ. ప్రభుచరణ్-జగిత్యాల | (19-03-25) | 350 |
| పి. నీలిమారాజారత్నం, ఉయ్యూరు | (14-03-25) | 350 |
| యస్. గోపి, పార్వతీపురం | (17-12-24) | 350 |
| బి. రవికుమార్, హైదరాబాద్ | (20-11-24) | 350 |
| వి. రత్నమ్మ, హైదరాబాద్ | (17-10-24) | 350 |
| జి. క్యాథరిన్, ఒంగోలు | (08-10-24) | 350 |
| సిహెచ్. శైలజ, విజయవాడ | (04-04-25) | 200 |

చిన్నపిల్లల పేజి

# పై రూపము

విక్కీకి తమ క్రొత్త ఇల్లు బాగా నచ్చింది. అందులోను ముఖ్యంగా ఎంతో విశాలంగా ఉన్న ఆటస్థలం నచ్చింది. ఎందుకంటే విక్కీకి ఆటలంటే మక్కువ. వెంటనే విక్కీ తనతో తెచ్చుకున్న బాల్ తీసుకొని గ్రౌండ్‌లోకి పరిగెత్తాడు.

క్రొత్త ప్రదేశం కావడంతో విక్కీతో ఆడుకోవడానికి స్నేహితులు ఎవరూ లేరు అయినా ఏమి నిరాశ చెందక వాలీబాల్ ఆడుకుంటున్న విక్కీ , నేను నీతో ఆడవచ్చా అన్న స్వరం విని వెనుదిరిగి చూశాడు. తన వయస్సున్న అబ్బాయి నిలబడి నన్ను నీతో ఆడనివ్వవూ ప్లీజ్ అని బ్రతిమాలు తున్నాడు.

ఆ అబ్బాయి ఎవరో విక్కీకి తెలియదు. ఎవరు నువ్వు? అన్నట్లు తలాడించాడు విక్కీ. తన పేరు వినయ్ అని, విక్కీ వాళ్ళింట్లో పనిచేసే వంటమనిషి కొడుకునని పరిచయం చేసుకున్నాడు వినయ్. ఆ రోజుతో వారి స్నేహం. మెదలైంది. ఆర్థిక స్థితిగతులలో వారి మధ్య ఎంతో వ్యత్యాసం ఉన్నా వారి స్నేహానికి అవి అడ్డుకాలేదు. ఆటలంటే వారిద్దరికి ఉన్న మక్కువ వారిని కలిపింది.

వినయ్ పేరుకు తగ్గట్టే వినయంగా ఉండేవాడు. ఎవరు ఏ పని చెప్పినా చేసేవాడు. క్రమం తప్పకుండా సండేస్కూల్‌కి వెళ్ళేవాడు. అక్కడ తాను నేర్చుకున్న విషయాలు విక్కీతో పంచుకునే వాడు. ప్రతిరోజు స్కూల్‌నుండి వచ్చే విక్కీ కొరకు వినయ్ ఎదురుచూస్తే ఆదివారం మాత్రం వినయ్ కోసం విక్కీ ఎదురు చూసేవాడు.

విక్కీ స్కూల్ ఫ్రెండ్స్, ఇంట్లో వాళ్ళు వినయ్ వంటి పేదవానితో స్నేహం చేయవద్దని చెప్పినా విక్కీ వినలేదు. అందునుబట్టి వినయ్ విక్కీకి, అతని స్నేహానికి అధిక ప్రాధాన్యత ఇచ్చేవాడు. అంతేకాదు విక్కీవంటి స్నేహితున్ని కలిగి ఉన్నందుకు సంతోషించేవాడు, కాస్తంత గర్వంగా కూడా ఫీల్ అయ్యేవాడు.

ఒకరోజు విక్కీ తన కొత్త రిమోట్‌కార్‌ను తీసుకొనివచ్చి వినయ్‌కు చూపిస్తూ – ఇదొక హైయండ్ ట్రాన్సాఫామబుల్ పవర్‌రేంజర్ కార్. ఈ కార్ కొరకు దాదాపు 2సం॥ల నుండి ఎదురు చూస్తున్నాను. ఫైనల్‌గా ఇప్పుడు ఇది నాకు సొంతమైంది అంటూ ఆ కార్‌ను రిమోట్‌తో ఆపరేట్ చేయసాగాడు. ఆ కార్ అత్యంత వేగంగా వెళ్ళడమే కాక అడ్డకులను తప్పించుకుంటూ వెళ్తుంది. అటువంటి కార్‌ను చూడడం, దాని గురించి వినడం వినయ్‌కి అదే మొదటిసారి. వినయ్ కళ్ళల్లో ఆశ్చర్యం ఆ విషయాన్ని స్పష్టం చేస్తుంది. ఇంతలో వినయ్ కళ్ళు ఆశ్చర్యంతో మరింత పెద్దవైనాయి. ఆ కారు ఆటోమెటిక్‌గా తన రూపాన్ని మార్చుకొని కాళ్ళు చేతులు గల బొమ్మలాగా మారింది. వినయ్ తన కళ్ళను తానే నమ్మలేకపోయాడు. విక్కీ ఆనందంతో గెంతులు వేస్తున్నాడు.

తానుకూడ ఆ కార్‌తో ఆడుకోవాలనుకున్నాడు వినయ్. కాని విక్కీ ఆ కార్‌తో ఆడుకోవడంలో పూర్తిగా మునిగి పోయాడు. వినయ్ అడిగితే ఇస్తాను అంటున్నాడు కాని ఎంతసేపటికి ఇవ్వడం లేదు. అలా రెండురోజులు గడిచాయి విక్కీ ఆ కార్‌తో బిజీగా ఉండటం, వినయ్‌కి ఆ కార్‌తో ఆడుకోవడానికి అవకాశం రాలేదు. వినయ్ ఎంతో బ్రతిమాలిన తరువాత విక్కీ తన కారును వినయ్‌కి ఇవ్వడంతో వినయ్ ఆనందానికి హద్దులు లేవు. వినయ్ ఆనందం అతని కళ్ళల్లో కనిపించింది.

ఒకరోజు విక్కీ తన కారు కనిపించలేదని ఇళ్ళంత వెతకసాగాడు. అయినా కారు కనపడలేదు. చివరకి విక్కీ బాగా ఆలోచించిన మీదట ఆ కారును వినయ్ దొంగతనం చేసి ఉంటాడేమో అని వినయ్‌ని అడిగినప్పుడు వినయ్ తను ఆ కారు దొంగతనం చేయలేదని చెప్తాడు. అయితే విక్కీ ఆ కారంటే వినయ్‌కి ఎంతో ఇష్టం, పైగా అటువంటి కారు కొనే ఆర్థికస్థితి వినయ్‌కి లేదు కాబట్టి అతనే దొంగతనం చేసి ఉంటాడని నమ్మి వినయ్‌ని దూరం

పెట్టసాగాడు. వినయ్ ఎంత చెప్పిన విక్కీ వినలేదు. తనకెంతో ఇష్టమైన కారు పోగొట్టుకొనినందున విక్కీ చాలా బాధలోను, దానికి కారణం వినయ్ అని నమ్మి కోపంలోను ఉన్నాడు.

విక్కీ నుండి ఊహించని ప్రశ్నను, పరిస్థితిని ఎదుర్కొన్న వినయ్ తల్లికి విషయం చెప్పి చాలా బాధపడ్డాడు. ఏడ్చాడు. తన బెస్ట్‌ఫ్రెండ్ తనని దొంగ అనడం వినయ్ జీర్ణించు కోలేకపోయాడు. అందుకు వినయ్ తల్లి "మనుష్యులు పైరూపమును లక్ష్యపెట్టుదురు కాని యెహోవా హృదయ మును లక్ష్యపెట్టును" అని బైబిల్లో వ్రాయబడి ఉంది. ఈ లోకంలో మనుష్యులు మన పరిస్థితులు, మనం కలిగియున్న ఆస్తిపాస్తులనుబట్టే మనకు విలువ ఇస్తారు. కానీ దేవుడు మాత్రమే మన హృదయాలను చూస్తాడు. కాబట్టి నీవు నీ స్నేహితుని ప్రవర్తన గురించి బాధపడక అతని గురించి ప్రార్థించమని చెప్పింది. వినయ్ తల్లి మాట ప్రకారం విక్కీ కొరకు అనుదినం ప్రార్థించసాగాడు.

ఊహించని విధంగా ఒక రోజు ప్రొద్దున్నే వినయ్ విక్కీ ఇంటి బయట నిలబడి ఉన్నాడు. ఆశ్చర్యం కలిగినా ఆనందంతో విక్కీని కౌగిలించుకున్నాడు వినయ్. విక్కీ చేతిలో ఆ టాయ్ కారు ఉంది. వెంటనే ప్రశ్నార్థకంగా విక్కీ వంక చూశాడు వినయ్.

తన పెంపుడు కుక్క ఒక ఆట వస్తువును పెరటివైపు తీసుకెళ్ళడం గమనించి దానిని అనుసరించిన విక్కీకి పెరట్లో ఒక మూలన తన పాత ఆట వస్తువులతో పాటు ఈ కారు కూడ కనపడడంతో తన తప్పు తెలుసుకున్న వాడై క్షమాపణ అడగడానికి వినయ్ వద్దకు వచ్చాడు.

క్షమాపణ అడిగన విక్కీతో వినయ్ నా పేదరికమును బట్టి నేను దొంగతనం చేసుంటానని నీవను కున్నావు. అప్పుడు నాకు చాలా బాధేసింది యేసయ్య ఒక్కడే నా పైరూపాన్ని కాక హృదయాన్ని చూస్తాడని తెలుసుకున్నాను. నీ కొరకు అనుదినం ప్రార్థించాను. దేవుడు జవాబిచ్చాడు అన్నాడు. మరెన్నడు ఇలా ప్రవర్తించను అని వినయ్‌ని తన ఇంటి ప్లే గ్రౌండ్‌లోకి తీసుకెళ్ళాడు విక్కీ.

## బైబిల్ పద వినోదము-9 జవాబులు

| | | | | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| అ | గుం | పూ | అ | స | తే | అ | పో | క | చి | దో | ల | ము | కె | షె |
| సూ | ట | ర్వి | అ | మ్మ | వ | నె | తీ | క | ల | తా | స | వ | అ | మ |
| యు | ల | కు | చె | తి | వ | ర | ఫ | ల | న | ను | స | మృ | ద్ధి | స్త |
| ఒ | అ | లు | ర | గో | షె | ను | రు | ఏ | గ | తా | ళీ | అ | రూ | కి |
| ప | న | లు | సా | అ | సా | ధ్య | ము | జీ | దై | వ | భా | క్షి | క | అ |
| గో | నె | లు | ల | న | ద | ర్యా | మ | అ | వ | అ | వ | ణ | లు | గం |
| కా | యి | లా | అ | యా | జ | కు | లు | త | న | ము | ము | త | ప | వౌ |
| ర్య | చ | రి | ప | అ | పిం | డి | వం | ట | లు | అ | పో | తీ | ఫె | ర |
| మై | న | ఆ | సె | న | తు | అ | త్మ | మి | ద్యా | నీ | యు | లు | పే | లు |
| అ | ము | వే | బై | హే | అ | గ | బ | జ | డి | సి | ము | న | కు | శ |
| దు | న | గు | ము | య | బో | ర్భ | ల | వి | నా | యిం | చు | ట | అ | లు |
| లా | ది | ల | క్ష | ము | ళ | వా | హీ | ము | బ | వ | ర్త | కు | లు | ము |
| గి | న్మ | వా | మ | అ | ము | స | న | ర | త్తె | లు | క | రు | వు | త్ర |
| అ | జ | రు | స | లై | అ | ము | ము | పా | ము | క్షు | బ | ప | అ | క్ష |
| గు | గ్గి | ల | ము | అ | కో | ప | ము | వ్యా | అ | ప | ఖై | దీ | లు | న |

**జవాబులు పంపినవారు :**

1. యన్. శారద–జాండ్రపేట, 2. 4. బి. నెహెమ్యా –చిన్నగంజాం, 3. జి. మేరి కేథరిన్–ఒంగోలు, 4. యన్. షాలేమురాజు–పైడిపాడు, 5. కె. యేసురత్నం–ఒంగోలు, 6. టి. క్రిస్టియానమ్మ–నందికొట్కూరు, 7. జి. ఏంజల్ పౌలాస్– ఒంగోలు, 8. జె. రాజకుమారి– గుంటూరు, 9. కె. సునాదశ్రీ–బొమ్మూరు, 10. కె. లలితాభాగ్యం–కనిగిరి, 11. డి. సాల్మన్‌రాజు–నంద్యాల, 12. యం. స్వయంప్రభ–చిలకలూరిపేట, 13. వై. సంధ్యారాణి –ఒంగోలు, 14. కె. ప్రభాకర్–వెంకటగిరి, 15. పి. ప్రభుకుమార్–ఒంగోలు, 16. యన్. రవి–పులివెందుల, 17. కె. చిన్నయోసేపు–దోర్నాల, 18. పి. విజయకుమారి –ఒంగోలు, 19. ఎ. బలరామ్–ఒంగోలు, 20. 1. బి. ప్రభువరకుమార్–రామన్నపేట, 21. రంజిత్ సింగ్ రామానుజులు–ఒంగోలు, 22. కె. మేరిపవిత్ర–మంచిర్యాల.

**సండేస్కూల్/V.B.S. బుక్స్ మరియు గేమ్స్ కొరకు**

**ఫోన్: 9440217726**

# భైబిల్ పద వినోదం - 10

## మోషే

ఈ క్రింది పదాలను ప్రక్కనున్న అక్షరాలలో వెదకండి. పదాలు అడ్డంగా, నిలువుగా, క్రాస్‌గా ఉండ వచ్చు, కానీ పదాలు ఒకదాని మీదగా ఇంకొకటి గుర్తించ కూడదు. గుర్తించిన క్రింది పదమును (✓) టిక్ పెట్టండి. మిగిలిన అక్షరాలను ఎడమ నుండి కుడికి, కుడి నుండి ఎడమకు సమకూర్చి వచ్చిన వాక్యమును క్రింద బాక్స్‌లో వ్రాయండి.

| | | | | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| ఎ | ఎం | దు | హి | స్సో | పు | బు | క | న | గా | బా | దే | వు | ని | సి |
| లీ | ల | మి | బ | మై | వ | దా | జీ | స | తి | ని | ము | క్య | ప్పో | వా |
| షె | ము | గ | ద్యా | ల | ద్దై | నా | రెం | డం | న్న | స | చు | రా | లు | గ |
| బ | ద్గ | ఖ | టి | ను | స్గా | పి | తె | ఎ | సు | లు | వం | టు | యె | ల |
| బ | య | ల్సె | ఫో | ను | ము | కం | గు | లి | టె | మొ | ను | క | నా | ను |
| బు | రే | హో | ఉం | కూ | గా | డి | ళ్ళు | యా | ర | వా | ను | రో | హ | అ |
| డి | అ | ర | ణ్య | ము | షు | ప్రా | ణా | జ | త్మ | తు | ల | యి | ను | కీ |
| లు | మం | దు | చు | న్న | పొ | ద | లే | రు | మూ | ర్కో | ను | ళ్ళ | త్రో | పీ |
| అ | గ | రు | జె | యె | లీ | ఎ | ను | వి | వి | సు | భ | జిం | చు | తో |
| మ్రా | ము | న | ఠి | క | ట్టు | ప | మ | ఫీ | నె | హా | సు | త | నం | ము |
| ము | సు | కు | ఈ | ము | దూ | రు | స్కా | చు | ఇ | శ్రా | యే | లీ | యు | లు |
| లం | సే | త | తా | ర్షో | క్క | యొ | దు | ము | డు | మో | య | ఫ | ద | హృ |
| పు | మ | ల | మా | గె | ను | హు | బె | ఆ | కు | లో | షే | చ | రో | ము |
| నె | రా | పూ | రు | ధిం | బీ | శో | కె | హూ | త్వి | ను | ల | షి | న | ర్యా |
| బో | చు | చు | యా | అ | న్న | ది | యో | రు | సా | ఐ | గు | ప్తు | ఫ్రా | మి |

పేరు..............................గ్రామము..............................

అడ్రస్ లేబుల్ మీద ఉన్న బుక్ సీరియల్ నంబరు..............................

**'బైబిలు పద వినోదము-10'** పూర్తి చేసిన తర్వాత పేరు, ఊరు, అడ్రస్ లేబుల్ మీద ఉన్న బుక్ సీరియల్ నంబరు వ్రాసి ఈ పేజీని ఫోటో తీసి 9440217726 నంబరుకి వాట్సాప్ ద్వారా పంపగలరు లేదా ఈ పేజీని జెరాక్స్ తీసి **15వ తేదీలోగా** మా అడ్రసుకు పంపగలరు. సీరియల్ నంబరు వేయకపోతే వారి పేరు ప్రచురింపబడదు.

| | | | | | |
|---|---|---|---|---|---|
| మోషే | కూషు | ఎలియాజరు | బానిసలు | సుక్కోతు | మిర్యాము |
| ఈతామారు | యిత్రో | బయల్సెఫోను | కఠినము | అహరోను | ఫీనెహాసు |
| మిద్యాను | ఇశ్రాయేలీయులు | నెబో | అమ్రాము | గెర్షోము | హోరేబు |
| షిఫ్రా | పిస్గా | యోకెబెదు | ఎలీయెజెరు | తెగుళ్ళు | పూయా |
| హూరు | ఎలీషెబ | ఫరో | సాత్వికుడు | మండుచున్నపొద | అబీహు |
| లేవి | సిప్పోరా | ఐగుప్తు | పస్కా | మొర | సున్నతి |
| అరణ్యము | నాదాబు | పీతోము | హిస్సోపు | కనాను | రామసేసు |

**పై పదాలను గుర్తించిన తర్వాత మిగిలిన అక్షరాలను సమకూర్చి, వచ్చిన వాక్యమును ఇక్కడ వ్రాయండి.**

ఎందుకనగా దేవుని వాక్యము _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _

_ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ (హెబ్రీ. 4:12)